Crime Mirror
QR Code

https://epaper.crimemirror.com/

# క్రైమ్ మిర్రర్®

Voice of Anti Corruption

హైదరాబాద్
10-1-2025
వెల: రూ.5/-
పేజీలు: 10+10
సంపుటి:14
సంచిక: 59

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD



## పంచాయతీ ఉద్యోగులకు

# ప్రతినెలా జీతాలు

### ప్రభుత్వ ఉద్యోగుల మాదిరిగా చెల్లించండి

### ఇబ్బంది రాకుండా గ్రీన్ చానల్ ద్వారా ఇవ్వండి

### ఉపాధి బిల్లులు సకాలంలో కూలీలకు అందాలి

### పంచాయతీరాజ్ సమీక్షలో సీఎం రేవంత్ ఆదేశం

హైదరాబాద్: రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలలో పనిచేస్తున్న ఉద్యోగుల జీతాలను ప్రభుత్వ ఉద్యోగుల తరహాలో ఇకపై నెలనెలా చెల్లించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. రాష్ట్రంలోని గ్రామ పంచాయతీల్లో 92,351 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. వీరికి ప్రతినెలా రూ.116 కోట్లు జీతాలుగా చెల్లించాల్సి ఉంది. ఈ జీతాల చెల్లింపులో ఆలస్యం జరగకుండా స్పష్టమైన విధానం అనుసరించాలని పంచాయతీరాజ్, ఆర్థిక శాఖ అధికారులను సీఎం ఆదేశించారు. గ్రీన్ చానల్ ద్వారా వీరికి జీతాలు చెల్లించాలని సూచించారు. గురువారం ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు.

**కేంద్రం నుంచి నిధులు రాబట్టాలి**

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద కూలీలకు ఇచ్చే బిల్లులను సకాలంలో చెల్లించాలని సీఎం ఆదేశించారు. గతేడాది ఏప్రిల్ నుంచి దాదాపు 1.26 లక్షల ఉపాధి పనులు జరిగాయని.. వీటికి సంబంధించిన మొత్తం బిల్లులను త్వరగా చెల్లించాలని అధికారులకు సూచించారు. కేంద్రం నుంచి పంచాయతీలకు

(మిగతా 2వ పేజీలో)

## రేవంత్.. నీలా లుచ్చా పనులు చేయలే!

### రాష్ట్రాన్ని ప్రపంచ పటంలో నిలిపేందుకు పనిచేశాం

### ఈ రేసు కేసులో అడగడానికి ఏసీబీ వద్ద ఏమీలేదు!

### నన్ను ప్రశ్నించేందుకు వారే ఇబ్బందిపడ్డారు: కేటీఆర్



హైదరాబాద్, జనవరి 9 : ఫార్ములా–ఈ కారు రేసు వ్యవహారంలో తనను ప్రశ్నించడానికి ఏసీబీ అధికారుల వద్ద ప్రశ్నలేమీ లేవని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ అన్నారు. తెలంగాణ బ్రాండ్‌ను ప్రపంచవ్యాప్తం చేసేందుకే ఫార్ములా–ఈ రేసింగ్ నిర్వహించామని, మరోసారి నిర్వహించేందుకు అడ్వాన్స్ చెల్లించామని చెప్పారు. ఇందులో అవినీతి, అక్రమం ఏమీ జరగలేదని స్పష్టం చేశారు. గురువారం ఏసీబీ విచారణకు హాజరైన అనంతరం పార్టీ శ్రేణులతో ఊరేగింపుగా తెలంగాణ భవన్‌కు చేరుకున్న ఆయన.. నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి

(మిగతా 2వ పేజీలో)



## తిరుపతిలో టోకెన్లు ఇస్తున్నారని నాకు కూడా తెలియదు: సీఎం చంద్రబాబు

### తిరుపతిలో తొక్కిసలాట.. తిరుపతిలో చంద్రబాబు ప్రెస్ మీట్

### ఇకనైనా అందరూ సమన్వయంతో పనిచేయాలని అధికారులకు ఆదేశాలు

తిరుపతిలో తొక్కిసలాట ఘటన జరిగి శ్రీవారి భక్తులు మరణించిన వార్త కలచివేసిందని ఏపీ సీఎం చంద్రబాబు అన్నారు. విశాఖపట్నంలో బుధవారం నాడు ప్రధానమంత్రి రూ. 2.8 లక్షల కోట్ల పెట్టుబడులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారని, ఆ కార్యక్రమం పూర్తి చేసుకుని ఇంటికి వస్తున్న తరుణంలో ఈ విషాద వార్త విని మనసు వేదనకు గురైందని తెలిపారు. తిరుమల కొండపై ఇంతటి విషాదం జరగడం తనను ఎంతో బాధిస్తోందని, తొక్కిసలాటలో ఆరుగురు భక్తులు ప్రాణాలు విడిచారని వెల్లడించారు. లావణ్య(విశాఖ), శాంతి(విశాఖ), నాయుడు బాబు(నర్సీపట్నం), రజనీ(విశాఖ), నిర్మల (కోయంబత్తూర్), మల్లిక(మెట్టు సేలం) భక్తులు మరణించారని వివరించారు. వారి ఆత్మకు శాంతికలగాలని భగవంతుణ్ని ప్రార్థిస్తున్నానని తెలిపారు. "టీటీడీ బోర్డు ఛైర్మన్, సభ్యులు, జేఈవో సహా కొండపై అందరూ సమన్వయంతో పనిచేయాలి. దేవుని పవిత్రతకు భంగం కలిగించకూడదు. పెత్తందార్లుగా కాకుండా సేవకులుగా దేవుని సేవలో పాల్గొనాలి. తిరుమల పవిత్రతను కాపాడతానని మరోసారి చెబుతున్నాము. 45 ఏళ్లుగా నేను రాజకీయాల్లో ఉన్నాను. 23 ఏళ్లు టీడీపీ అధికారంలో ఉంది. తిరుపతిలో టోకెన్లు ఇస్తున్నారని నాకు కూడా తెలియదు. అక్కడ మరిన్ని జాగ్రతలు తీసుకోవాల్సి ఉంది. తిరుమలలో ఉన్న తృప్తి... తిరుపతిలో రాదని భక్తులు అంటున్నారు. గత ఐదేళ్లలో కొండపై చాలా

(మిగతా 2వ పేజీలో)

## నిధుల మళ్లింపుపైనే ఈడీ దృష్టి

### ఎనిమిది గంటలపాటు కొనసాగిన అర్వింద్‌కుమార్ విచారణ



హైదరాబాద్: ఫార్ములా – ఈ కారు రేసు కేసు దర్యాప్తులో భాగంగా సీనియర్ ఐఏఎస్ అధికారి అర్వింద్‌కుమార్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు సుదీర్ఘంగా విచారించారు. బ్రిటన్ కంపెనీకి హెచ్‌ఎండీఏ నుంచి నిధు ల మళ్లింపుపైనే ప్రధానంగా అర్వింద్‌కుమార్‌ను ఈడీ ప్రశ్నించినట్టు తెలిసింది. ఏసీబీ అధికారులు ఎఫ్‌ఐఆర్‌లో పేర్కొన్న అంశాలు, హెచ్‌ఎండీఏ మాజీ చీఫ్ ఇంజనీర్ బీఎల్‌ఎన్‌రెడ్డి విచారణ సందర్భంగా సేకరించిన అంశాల ఆధారంగా అర్వింద్‌కుమార్‌ను ఈడీ అధికారు లు ప్రశ్నించారు. ఈడీ సమన్ల మేరకు గురువారం ఉదయం 11.15 గంటలకు ఆయన బషీర్‌బాగ్‌లోని ఈడీ కార్యాలయానికి వచ్చారు. అప్పటి నుంచి రాత్రి 7.30 గంటల వరకు దాదాపు 8 గంటల పాటు ఈడీ అధికారులు ఆయనను

(మిగతా 2వ పేజీలో)



# రోజంతా ఉత్కంఠ!

### తెలంగాణ భవన్‌కు పెద్దసంఖ్యలో తరలివచ్చిన బీఆర్‌ఎస్ శ్రేణులు

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** ఫార్ములా ఈ కార్ రేసింగ్ కేసులో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ గురువారం ఏసీబీ విచారణకు హాజరు కాగా..దాదాపు ఆరున్నర గంటలపాటు ఎసిబి అధికారులు చేసిన విచారణ ముగిసింది. ఫార్ములా కేసులో నిధుల మళ్లింపుపై కేటీఆర్‌ను విచారించేందుకు ఏసీబీ అధికారులు ఆయనను నడిపించి విచారణ కోసం తీసుకొచ్చారు. ఈ కేసు దర్యాప్తు అధికారి డీఎస్పీ మజీద్ ఖాన్.. కేటీఆర్‌ను విచారించారు. ఈ విచారణను జాయింట్ డైరెక్టర్ రితిరాజ్ పర్యవేక్షించారు. విచారణను వేరే గది నుంచి చూసేందుకు కేటీఆర్ న్యాయవాది రామచంద్రరావును అనుమతించారు. ఎప్పుడు పిలిచినా విచారణకు హాజరుకావాలని ఏసీబీ అధికారులు సూచించారు. ఫార్ములా ఈ కార్ రేసింగ్ కేసులో పెద్ద మొత్తంలో నిధుల చెలామణీ, అన్యాయంగా ఆర్థిక లావాదేవీలు జరగడం వివాదంగా మారింది. ఈ వివాదంలో కేటీఆర్ ప్రధాన నిందితుడిగా ఉన్నారు. ఈ నేపథ్యంలో విచారణకు ఎప్పుడు పిలిచినా కూడా రావాలని ఏసీబీ తెలుపగా, కేటీఆర్ వస్తానని చెప్పారు. కేటీఆర్‌కు ఈ కేసులో అనేక ఆరోపణలు వచ్చాయి, అవి నిరూపించ డానికి ఏసీబీ అధికారులు విచారణ చేపట్టారు. గత కొన్ని రోజులుగా ఈ కేసు చుట్టూ కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి.

(మిగతా 2వ పేజీలో)

## రైతు భరోసాకు

# 8,400 కోట్లు

### 26 నుంచి పంపిణీ, అదే రోజుఇందిరమ్మ ఆత్మీయ భరోసా కూడా: భట్టి



మహబూబ్‌నగర్, జనవరి 9 : గణతంత్ర దినోత్సవం రోజు, జనవరి 26 నుంచి రాష్ట్రంలో అమలు చేయనున్న రైతు భరోసా పథకం కోసం రూ.8,400 కోట్లు సిద్ధం చేశామని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క ప్రకటించారు. వ్యవసాయ కూలీలకు ఏటా రూ.12 వేల చొప్పున అందజేసే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని కూడా జనవరి 26 నుంచే ప్రారంభిస్తామని తెలిపారు. ఏడాది పాలనలో ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత పార్టీ

(మిగతా 2వ పేజీలో)



## చరిత్రలో చూడని ఘోరం ఇది

### ఖచ్చితంగా ప్రభుత్వం చేసిన హత్యలే

### తిరుపతి ఘటనలో చంద్రబాబు నిర్లక్ష్యం నిజం

### భజన పరుల కారణంగానే తిరుపతి ఘటన

### ఛైర్మన్, ఇవో తదితరులపై చర్యలు తీసుకోవాలి

### సనాతన సంరక్షకుడు ఏంచేస్తున్నారు

### పవన్ కళ్యాణ్ తదితరులపై రోజా విసుర్లు

**తిరుపతి, (క్రైమ్ మిర్రర్):** తిరుమల చరిత్రలో ఎప్పుడూ జరగని ఘోరం చూశామని మాజీ మంత్రి ఆర్కే రోజా అన్నారు. చంద్రబాబు అసమర్థత ఈ ఘటనతో స్పష్టమైందని విమర్శిచారు.. ఘటనకు కారణమెవరో కనుక్కోకుండా నీతి మాలిన రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు.. అధికారులను, టీటీడీ బోర్డును ఎవరు పెట్టారని ప్రశ్నించారు.. భక్తులకు సర్వీస్ చేయాలన్న ఉద్దేశ్యం ఎవరికి లేదన్నారు.. అధికారులు చంద్రబాబు దగ్గర భజన చేస్తూ తిరుగుతూ భక్తులను గాలికి వదిలేశారని విమర్శించారు.. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. ఈ ఘటనకు ఎవరు బాధ్యులో తేల్చాలని డిమాండ్ చేశారు. అసమర్థ టీటీడీ చైర్మన్, ఎస్పీ, కలెక్టర్ వలనే ఈ పరిస్థితి వచ్చిందని.. వీరు ఎవరికీ భక్తి లేదన్నారు.

(మిగతా 2వ పేజీలో)

## తిరుపతిలో టోకెన్లు ఇస్తున్నారని నాకు కూడా తెలియదు: సీఎం చంద్రబాబు

అరాచకాలు జరిగాయి. కానీ రాజకీయాలు మాట్లాడదలుచుకోలేదు. అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలో ఉన్నా తిరుమలకు వచ్చినప్పుడు నేను సామాన్య భక్తుడిగానే ఉంటా. వైకుంఠ ఏకాదశికి ఎన్ని టికెట్లు ఇవ్వాలనేదానిపై నిర్ణయం తీసుకుంటాం” అని సీఎం చంద్రబాబు నాయుడు అన్నారు. “వెంకటేశ్వరుని సన్నిధిలో ఎలాంటి అపచారాలు జరగకూడదు. తిరుమల పవిత్రతను నిలబెట్టడం ఒక భక్తుడిగా, ముఖ్యమంత్రిగా నా బాధ్యత. ఈ దివ్యక్షేత్రం పవిత్రతను కాపాడేందుకు కొన్ని నిర్ణయాలు తీసుకున్నాము. మనం చేసిన పనుల వల్ల దేవుని పవిత్రత దెబ్బతినకూడదు. తెలిసి చేసినా తెలియక చేసినా తప్పు తప్పే. రాజకీయాలకు అతీతంగా కలియుగ దైవమైన వెంకటేశ్వరునికి సేవ చేస్తున్నామని ప్రతి ఒక్కరూ అనుకోవాలి. క్రిస్టియన్లు జెరూసలేం, ముస్లింలు మక్కాకు వెళ్తారు. హిందువులు తిరుమల కొండకు వస్తారు. జీవితంలో ఒక్కసారైనా వైకుంఠ ఏకాదశి నాడు శ్రీవారిని దర్శించుకోవాలని భక్తులు అనుకుంటారు. వైకుంఠ ఏకాదశి నాడు స్వామి దర్శనం చేసుకుంటే వైకుంఠానికి వెళ్తామని భక్తుల ప్రగాఢ నమ్మకం’ అని సీఎం అన్నారు.

## నిధుల మళ్లింపుపైనే ఈడీ దృష్టి

ప్రశ్నించారు. హెచ్ఎండీఏకి చెందిన రూ.54.89 కోట్లను నిబంధనలకు విరుద్ధంగా బ్రిటన్‌కు చెందిన ఫార్ములా %-%ఈ ఆపరేషన్స్ (ఎఫ్ఈఓ) సంస్థకు ఎందుకు బదలాయించాల్సి వచ్చింది? హెచ్ఎండీఏ బోర్డు నిధుల ఖర్చు విషయంలో ఎలాంటి నిబంధనలు ఉంటాయి? ఫార్ములా%-%ఈ కారు రేసు సీజన్ 9,10 నిర్వహణ కోసం చేసుకున్న ఒప్పందాలు.. తదితర అంశాలపై విచారణ జరిపినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా.. విధి నిర్వహణలో భాగంగానే తాను అంతా చేసినట్టు అర్విండ్‌కుమార్ సమాధానమిచ్చినట్టు తెలిసింది. అవసరం అయితే మరోమారు విచారణకు రావాల్సి ఉంటుందని ఈడీ అధికారులు అర్విండ్‌కుమార్‌కు సూచించినట్టు సమాచారం.

## రైతు భరోసాకు 8,400 కోట్లు

శ్రేణులదేనని అన్నారు. వనపర్తి జిల్లాలో గురువారం రెండు విద్యుత్ సబ్ స్టేషన్లను ప్రారంభించి మరో ఏడింటికి శంకుస్థాపన చేసిన భట్టి.. ఆ తర్వాత ముఖ్య కార్యకర్తలతో సమావేశమయ్యారు. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడానికి ప్రభుత్వం రోజూ 18 గంటలపాటు పనిచేస్తోందని తెలిపారు. గత ప్రభుత్వం రూ. 7 లక్షల కోట్ల అప్పును ప్రజల నెత్తిన మోపిందని దుయ్యబట్టారు. ఇబ్బందులున్నా ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మూడు నెలల్లోనే రూ. 22 వేల కోట్ల రుణమాఫీ చేశామన్నారు.

## బెనిఫిట్ షో అవసరమేముందో చెప్పండి

**సినిమా టికెట్ల ధరల పెంపుపై హైకోర్టు అసహనం..**

**అలా మెమోలు ఎందుకు ఇస్తున్నారని ప్రశ్న**

**వేకువజాము, అర్ధరాత్రి అనుమతులు ఇస్తారా?**

**ప్రజల భద్రతపై ఆలోచించాలి కదా అని వ్యాఖ్య**

**‘గేమ్‌ఛేంజర్’ టికెట్ల ధర పెంపుపై పిటిషన్**

**నేడు విచారణ చేపడతామన్న జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి**




హైదరాబాద్: రాష్ట్రంలో సినిమా టికెట్ల ధరల పెంపు, బెనిఫిట్ షోలకు అనుమతి ఇవ్వడంలో సర్కార్ తీరుపై హైకోర్టు అసహనం వ్యక్తం చేసింది. ప్రముఖ చిత్రాలకు బెనిఫిట్ షోలకు, ఇష్టం వచ్చిన సమయాల్లో ప్రదర్శనకు ఎందుకు అనుమతి ఇస్తున్నారని, వాటి అవసరం ఏముందని ప్రశ్నించింది. ప్రజల భద్రత గురించి కనీసం అలోచించాల్సిన అవస రం లేదా అని నిలదీసింది. 16 ఏళ్లలోపు పిల్ల లను అర్ధరాత్రి, తెల్లవారుజాము ప్రదర్శనలకు అను మతించకూడదని సూచించింది. ఇలాంటి అంశాల్లో ఒక్క చిత్రంపై ఇలా పిటిషన్ దాఖలు చేయడం కాకుండా.. ప్రజా ప్రయో జన వ్యాజ్యంగా విచారణ జరపాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడింది. తదుపరి విచారణను నేటికి వాయిదా వేసింది. దిల్ రాజు నిర్మాతగా శంకర్ దర్శకత్వంలో రామ్ చరణ్ నటించిన గేమ్ ఛేంజర్ సినిమా టికెట్ ధరల పెంపునకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతిచ్చింది. హోంశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవి గుప్తా ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. జనవరి 10న మల్టీప్లెక్స్ థియేటర్లలో ఒక్కో టికెట్‌పై అదనంగా రూ. 150, సింగిల్ స్క్రీన్ థియేటర్లలో ఒక్కో టికె ట్‌పై అదనంగా రూ. 100 చొప్పున పెంచుకునేందుకు వెసులు బాటు కల్పించింది. జనవరి 11 నుంచి రోజూ 5 షోల నిర్వహణకు అనుమతిస్తు న్నట్లు పేర్కొన్నారు. 11 నుంచి 19 వరకూ మల్టీ ప్లెక్సులలో టికెట్‌పై అదనంగా రూ. 100, సింగిల్ స్క్రీన్ థియేటర్లలో టికె ట్‌పై అదనంగా రూ. 50 రూపాయల చొప్పున ధరలు పెంచు కోడానికి సర్కార్ అనుమతిచ్చింది. అర్ధరాత్రి బెనిఫిట్ షోలకు మాత్రం సర్కార్ నిరాకరించింది.

# రేవంత్.. నీలా లుచ్చా పనులు చేయలే!

మాట్లాడారు. “రేవంత్‌రెడ్డీ నీలాగా లుచ్చా పనులు మాకు రావు. మేం రూ.50 లక్షలతో దొరికిపోయిన దొంగలం కాదు. తెలంగాణ రాష్ట్రాన్ని, హైదరాబాద్‌ను ప్రపంచపటంలో నిలపాలన్నది కేసీఆర్ లక్ష్యం. అందుకోసమే పనిచేశాం. మాకు భయంలేదు. ఎన్నికేసులు పెట్టినా.. ప్రజలకోసం నిన్ను ప్రశ్నిస్తూనే ఉంటాం. ఎన్ని అక్రమ కేసులు పెట్టినా ప్రజా సంక్షేమం కోసం కేసీఆర్ సైనికుడిగా మాట్లాడతా” అని కేటీఆర్ స్పష్టం చేశారు. “ప్రపంచ దేశాలతో పోటీపడి ఫార్ములా-ఈ రేసు హైదరాబాద్‌కు తెచ్చా. నగర ప్రతిష్ఠ కోసం, తెలంగాణను ఎలక్ట్రిక్ వాహనాల తయారీ కేంద్రంగా మార్చాలన్న ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఏసీబీ అధికారులకు చెప్పా. నన్ను ప్రశ్నించడానికి వారే ఇబ్బందిపడ్డారు. ఏ అంశం లేకపోవడంతో ఆ ఫైల్ ఎక్కడకు వెళ్లింది? ఈ ఫైల్ ఎక్కడకు వెళ్లింది? అంటూ అడిగిన ప్రశ్నలనే అడిగారు. ఇక్కడి నుంచి పోయిన డబ్బులు ఫార్ములా-ఈ స3434ంస్థ వద్ద ఉన్నాయని చెప్పా. అలాంటప్పుడు కేసు ఎక్కడ ఉందని, అవినీతే లేనప్పుడు ఏసీబీ కేసు ఎందుకని అడిగా. మంత్రిగా ఈ నిర్ణయం తీసుకున్నానని చెప్పా. పదేళ్లు నిబద్ధతతో బాధ్యతలు నిర్వహించినట్లు స్పష్టం చేశా” అని చెప్పారు. ఇప్పటికి ఏసీబీ వద్ద ప్రశ్నలు లేవని, ఒకవేళ రేవంత్‌రెడ్డి రాసిచ్చి, మరోసారి విచారణకు రమ్మంటే తప్పకుండా వెళ్తానని తెలిపారు. తనకు న్యాయస్థానాలు, చట్టాలపై నమ్మకం ఉందని.. విచారణకు సహకరిస్తానని అన్నారు. ఇది ముమ్మాటికీ లొట్టపీసు కేసని.. ఆయనొక లొట్టపీసు ముఖ్యమంత్రేనని విమర్శించారు. ‘పదవిలోకి వచ్చి ఏడాది గడిచినా నువ్వొక సీఎంవని ప్రజలెవరూ గుర్తించడం లేదు. తెలంగాణ పరిస్థితి కనకపు సింహాసనమున శునకమును కూర్చోబెట్టినట్లుగా ఉంది’ అని విమర్శలు గుప్పించారు. తెలంగాణ భవన్‌కు రాకముందు ఏసీబీ కార్యాలయం బయట కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. కక్షపూరిత కేసు పెట్టించిన సీఎం రేవంత్‌రెడ్డి ఏసీబీకి కొన్ని ప్రశ్నలు రాసిచ్చారని ఆరోపించారు. అడిగేందుకు ఏమీ లేకపోవడంతో అధికారులు 4 ప్రశ్నలనే 40 రకాలుగా అడిగారన్నారు. అవినీతి ఎక్కడ జరిగిందో చెప్పాలని వారిని అడిగినట్లు కేటీఆర్ తెలిపారు. అధికారులు అడిగిన ప్రశ్నలన్నింటికీ సమాధానం ఇచ్చానన్నారు. ‘మీరు నమోదు చేసింది చెత్త కేసు. ఇందులో విషయమే లేదు. ప్రభుత్వ ఒత్తిడితో మీరేం చేస్తున్నారో మీకే తెలియడం లేదు’ అని అధికారులతో అన్నట్లు కేటీఆర్ చెప్పారు. మీడియాతో మాట్లాడుతుండగా పోలీసులు అభ్యంతరం చెప్పడంతో ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.



### కేటీఆర్‌కు మద్దతుగా బీఆర్ఎస్ శ్రేణులు

కేటీఆర్‌కు మద్దతుగా బీఆర్ఎస్ శ్రేణులు గురువారం ఉదయం నుంచి నందినగర్‌లోని ఆయన నివాసానికి చేరుకున్నారు. ఎమ్మెల్సీ కవిత ఉదయాన్నే అక్కడికి చేరుకున్నారు. హరీశ్, ఇతర ముఖ్య నేతలు వచ్చి కేటీఆర్‌కు మద్దతు పలికారు. ఉదయం 9.50 గంటలకు కేటీఆర్ ఏసీబీ కార్యాలయానికి బయలుదేరి వెళ్లారు. సాయంత్రం ఇంటికి వచ్చిన కేటీఆర్‌కు కవిత హారతి ఇచ్చి ఆహ్వానం పలికారు.

### కేటీఆర్‌ను భుజాలపై మోసిన కౌశిక్‌రెడ్డి

ఏసీబీ కార్యాలయం నుంచి కేటీఆర్ బయటకు వచ్చాక.. బీఆర్ఎస్ శ్రేణులు అక్కడి నుంచి తెలంగాణ భవన్‌కు ఊరేగింపుగా బయలుదేరి వెళ్లాయి. ఆ సమయంలో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి కేటీఆర్‌ను భుజాలపై మోస్తూ.. ‘సీఎం.. సీఎం’ అంటూ నినాదాలు చేశారు.

## రోజంతా ఉత్కంఠ!

కేటీఆర్‌ను ముగ్గురు ఏసీబీ అధికారులు ప్రశ్నించారు. అరవింద్ కుమార్, దానకిషోర్ ఇచ్చిన స్టేట్‌మెంట్స్ ఆధారంగా ఈ విచారణ జరగింది. ఫార్ములా ఈ కార్ రేసింగ్ ప్రాజెక్టులో నియమాలను ఉల్లంఘించి రూ.55 కోట్లు ఎఫ్ఈవోకు బదిలీ చేసినట్లుగా ఆరోపణలు ఉన్నాయి. ఈ అంశంపై ఏసీబీ కేటీఆర్‌ను విచారించింది. అయితే కేటీఆర్ విచారణ సందర్భంగా న్యాయవాదికి అనుమతి ఇవ్వాలని హైకోర్టు ఇప్పటికే ఆదేశించింది. ఈ ఆదేశం ప్రకారం కేటీఆర్ విచారణను అనుసరించి, న్యాయవాది లైబ్రరీలో కూర్చోవడం ద్వారా ఏసీబీ చర్యలు తీసుకుంది. కేటీఆర్-న్యాయవాది సంభాషణలకు విజిబుల్ డిస్టెన్స్‌లో ఉండేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఈ విచారణ తర్వాత కేటీఆర్ స్టేట్‌మెంట్‌ను రికార్డ్ చేసేందుకు ఏసీబీ అధికారులు కేటీఆర్‌ను ఆఫీస్‌లో విచారించారు. ఆయనను ప్రధాన నిందితుడిగా పేర్కొనడం, స్టేట్‌మెంట్ రికార్డు చేయడం తదితర చర్యలు తీసుకున్నాయి. దీంతో ఈ కేసు విషయంలో తర్వాత ఎలాంటి పరిణామాలు ఉంటాయేనని రాజకీయ వర్గాలతోపాటు అనేక మంది ఆసక్తితో ఉన్నారు. ఏసీబీ విచారణ అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. ‘పూర్తి స్థాయిలో ఏసీబీ విచారణకు సహకరించా. నాకున్న అవగాహన మేరకు ఏసీబీ అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పా. విచారణకు ఎప్పుడు పిలిచినా, ఎన్ని సార్లు పిలిచినా వచ్చి సహకరిస్తానని చెప్పా. మళ్లీ ఎప్పుడు పిలుస్తారో తెలియదు. ఇది ఒక చెత్త కేసు. రాజకీయ ఒత్తిడితో మీరు ఏం చేస్తున్నారో కూడా మీకే తెలియడంలేదు, పూర్తిగా అసంబద్ధమైన కేసు అని అధికారులకు చెప్పాను. నాలుగైదు ప్రశ్నలనే 40 రకాలుగా అడిగారు.. కొత్తగా అడిగిందేమీ లేదు. పైసలు పంపాను అని నేనే చెబుతున్నాను.. డబ్బులు వచ్చాయని వాళ్ళు చెబుతున్నారు. ఇందులో అవినీతి ఎక్కడ జరిగిందని అడిగా‘ అని కేటీఆర్ తెలిపారు. కేటీఆర్ మీడియాతో మాట్లాడుతుండగా డీసీపీ విజయ్‌కుమార్ అభ్యంతరం తెలిపారు. మీడియాతో మాట్లాడితే భయమెందుకని కేటీఆర్.. డీసీపీని ప్రశ్నించారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది కలుగుతుందని, ఇక్కడ మీడియా సమావేశం పెట్టవద్దని సూచించారు. పార్టీ కార్యాలయంలో ప్రెస్‌మీట్ పెట్టుకోవాలన్నారు. మీడియా ప్రతినిధులను పోలీసులు తోసేయడంతో... కేటీఆర్ అక్కడి నుంచి వెళ్లిపోయారు.అయితే పలు రకాల ప్రశ్నలనే 40 విధాలుగా అడిగారని కేటీఆర్ వ్యాఖ్యానించారు. అధికారులు అడిగిన ప్రశ్నలకు తాను చెప్పాల్సినది చెప్పినట్లు కేటీఆర్ తెలిపారు. అంతేకాదు ఈ కేసు పూర్తిగా రాజకీయ ప్రేరేపితమని, రేవంత్ చెప్పిన ప్రశ్నలనే అధికారులు అడిగారని కేటీఆర్ అన్నారు.

## చరిత్రలో చూడని ఘోరం ఇది

చంద్రబాబు భజనే వీరికి ముఖ్యమంటూ విరుచుకుపడ్డారు. పోలీసులను చంద్రబాబు సేవలో పెట్టారని.. వచ్చిన భక్తులకు కనీసం సౌకర్యాలు కూడా కల్పించలేదని ఆరోపించారు. ఇది ప్రభుత్వం చేసిన హత్యలే అని.. అందరిపై క్రిమినల్ కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. హీరో అల్లు అర్జున్‌కు సంబంధం లేకుండా తొక్కిసలాట జరిగితే ఆయనపై కేసు పెట్టారని.. మరి తిరుపతి ఘటనలో చంద్రబాబు నుంచి బీఆర్ నాయుడు, ఎస్పీలపై కేసులు పెట్టాలన్నారు. గత ఏడాది వైసీపీ హయాంలో ఎలా చేశామో అందరూ చూశారన్నారు. భక్తులకు కనీస సదుపాయాలు లేవు.. ఘటనకు నిర్లక్ష్యం కారణం కాదు.. ఇవి ప్రభుత్వం చేసిన హత్యలు.. తెలంగాణలో చూసాం.. ఓ ఘటనలో మహిళ చనిపోతే అల్లు అర్జున్ పై కేసు పెట్టారు.. ఈ ఘటనలో చంద్రబాబు నుంచి క్రింది స్థాయి అధికారులు బాధ్యత వహించాలి.. ఘటనను ప్రమాదవశాత్తూ జరిగిన ఘటనలా కేసులు నమోదు చేశారు.. విజయవాడ హైందవ శంఖారావంలో చెప్పారు.. హిందువులను కాపాడాలని చెప్పారు.. ఇప్పుడు ఆ పీఠాధిపతులు ఏమయ్యారు.. తిరుమల లడ్డుపై బీజేపీ, టీడీపీ నేతలు ఎన్ని మాట్లాడారో అందరూ చూశారు.. మీరు చేస్తే కరెక్టు.. మరొకరు చేస్తే తప్పు అన్నట్లు చేస్తున్నారు.. ప్రధాని మోడీకి ఒకటే విజ్ఞాపన చేస్తున్నా.. బాధ్యులను కఠినంగా శిక్షించాలన్నారు. సనాతన యోధుడు ఈ ఘటనకు ఏ ప్రాయశ్చిత్తం చేస్తారు.. చంద్రబాబుతో రాజీనామా చేయిస్తారా.. మీరు చేస్తారా.. అంటూ పవన్ కళ్యాణ్‌పై విమర్శలు గుప్పించారు. హోం మంత్రి కేవలం ఇతరులను తిట్టడానికి తప్ప లా అండ్ ఆర్డర్ కంట్రోల్ చేయటానికి పనికి రావటం లేదు.. తొక్కిసలాటకు కారణమైన బాధ్యతలపై క్రిమినల్ కేసులుపెట్టి లోపలేయాలి.. చంద్రబాబు పబ్లిసిటీ పిచ్చి వల్ల గోదావరి పుష్కరాల్లో 29 మంది ప్రాణాలు కోల్పోయారు.. ఘటనకు నిర్లక్ష్యం కారణం కాదు.. ప్రభుత్వం చేసిన హత్యలు.. చంద్రబాబు వైఫల్యం, అసమర్ధత వల్లే ఇంతమంది చనిపోయారు.‘ అని మాజీ మంత్రి రోజా వ్యాఖ్యానించారు.చంద్రబాబు అసమర్థ పాలనకు నిదర్శనంగా తిరుపతి ఘటన ఉందని మాజీ మంత్రి ఆర్కే రోజా వ్యాఖ్యలు చేశారు. ప్రధాని మోదీ కూడా దీనిపై స్పందించాలన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక దారుణాలు జరుగుతున్నాయని అంటూ కామెంట్స్ చేశారు. సనాతన యోధుడిని అని చెప్పుకునే ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఏం చేస్తున్నారని నిలదీశారు. కూటమి ప్రభుత్వం ఆరుగురిని చంపేసిందని.. ఎవరి నిర్లక్ష్యం వలన జరిగిందో తేల్చాలన్నారు.

అందరిపై కేసులు పెట్టించుకుని విచారణ జరిపించుకోవాలని అన్నారు. చంద్రబాబు లెగ్ మహిమ వలన ఎప్పుడూ జనాల చావులు తప్పటం లేదంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు.గోదావరి పుష్కరాల సమయంలో 29 మంది చనిపోయారని.. విజయవాడలో

# పిచ్చి తుగ్లక్ పాలనను తలపిస్తున్న వైఎస్ఆర్ ఉద్యాన వర్సిటీ ఇంచార్జి విసి పనితీరు

రెండు వందలమంది టీచింగ్ స్టాఫ్ ఉన్న విశ్వావిద్యాలయంలో సెప్టెంబర్ నెలలో యూనివర్సిటీ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా ఒకేసారి 45 మంది టీచింగ్ స్టాఫ్ ను బదిలీచేస్తూ ఉత్తర్వులు ఇచ్చారు అందులో ఒకరిని ఉద్యాన కళాశాల అనంతరాజుపేట నుండి కృషి విజ్ఞాన కేంద్రం పెట్లూరు (వెంకటగిరి)కు బదిలీ చేసి వెంటనే అభ్యర్థన మేరకు నిలుపుదలచేస్తూ ఉన్నచోటే కొనసాగిస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చారు, సంవత్సరం కూడా గడవక ముందే సొంత అభ్యర్ధనపై బదిలీ అయిన ఒక శాస్త్రవేత్తను అనంతపురం పరిశోధనా స్థానం నుండి మదనపల్లి పరిశోధనా స్థానానికి బదిలీ, తిరుపతికి సీనియర్ బదిలీ అడుగుతున్నప్పటికి సంవత్సరం గడవక ముందే ఒక అసిస్టెంట్ ప్రొఫెసర్ను తన అభ్యర్తన మేరకు పులివెందుల ఉద్యాన కళాశాల నుండి చీని నిమ్మ పరిశోధన స్థానం తిరుపతికి బదిలీ, ఉద్యాన పరిశోధనా స్థానం అనంతరాజుపేటలో ఇటీవల దాదాపు డెబ్బై లక్షల రూపాయల వ్యాయంతో టిష్యూకల్చర్ ల్యాబ్ ఏర్పాటు చేశారు,కోడూరు పరిసర ప్రాంతం అరటికి ప్రసిద్ధి వేల ఎకరాల్లో రైతులుఅరటి పండిస్తున్నారు అధిక దిగుబడి కోసం టిష్యూకల్చర్ అరటి వెయ్యడానికి రైతులు శ్రద్ధ చూపిస్తున్నారు అయితే టిష్యూకల్చర్ ల్యాబ్ ను ఇటీవలే ప్రారంభించారు ఇక టిష్యూకల్చర్ అరటి మొక్కలు సరఫరా చేస్తారన్నా ఆశతో రైతులు ఎదురుచూస్తున్న తారుణంలో టిష్యూకల్చర్ ల్యాబ్లో అనుభవం ఉన్న శాస్త్రవేత్తను ఆకస్మికంగా చినలాటరిపి ఉద్యాన కళాశాలకు బదిలీ చేశారు. మళ్ళీ టిష్యూకల్చర్ అరటి సరఫరా ఆగుతుందని రైతుల ఆశ ఆశగానే మిగులుతుందని రైతులు భావిస్తున్నారు. ఈ బదిలీల్లో అనేక ఆరోపణలు విచారణలు ఎదుర్కొంటూ గతంలో ఏ వైస్ ఛాన్సలర్ కూడా ఒక ప్రొఫెసర్ను తన నడవడిక తెలిసి కనీసం పరిశోధనా స్థానానికి అధిపతిగా కూడా నియమించని వ్యక్తిని ఏకంగా ఒక ఉద్యాన కళాశాలకు అసోసియేట్ డీన్ గా నియమించడం అలాగే అనేకమంది సీనియర్ ప్రొఫెసర్లు ఉన్నప్పటికీ జూనియర్ అయిన ఒక ప్రొఫెసర్ను పులివేందల ఉద్యాన కళాశాలకు అసోసియేట్ డీన్ గా నియమించడం ఏంటని అనేక మంది సీనియర్ ప్రొఫెసర్లు ఇంచార్జి వైస్ ఛాన్సలర్ నిర్ణయాన్ని తప్పుబడుతున్నారు.భార్యభార్తలైన ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఒకరు గుంటూరు పరిశోధన స్థానం నుండి ఇంకొకరు బాపట్ల పరిశోధన స్థానం నుండి అభ్యర్తన పెట్టుకుని కొన్ని నెలల క్రితం పులివెందులలోని పరిశోధన స్థానం మరియు ఉద్యాన కళాశాలకు వచ్చారు అయితే భార్యభర్తలు ఒకే చోట ఉన్నారని కూడా చూడకుండా భర్తను అక్కడే ఉంచి చిన్న పిల్లలున్నా భార్యను మళ్ళీ గుంటూరు పరిశోధనా స్థానానికి బదిలీ చేశారు.ఇదిలా ఉండగా చీని నిమ్మ పరిశోధన స్థానం నందు పని చేస్తున్న ఒక అగ్రానమి శాస్త్రవేత్తను మడకశిర పాలిటెక్నిక్ కళాశాలకు బదిలీ చేశారు సదరు శాస్త్రవేత్త చీని నిమ్మ పరిశోధనా స్థానంలో రిలీవ్ అయ్యి మడకశిర పాలిటెక్నిక్ కళాశాలలో చేరకముందే ఉద్యాన పరిశోధనా స్థానం మదనపల్లెలో పోస్ట్ చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చారు. కానీ ఉద్యాన విశ్వవిద్యాలయంలో అగ్రానమిస్ట్ కు చీని నిమ్మ పరిశోధనా స్థానంలోగానీ పండ్లు/పూలు పరిశోధనా స్థానంలో గానీ శాస్త్రీయంగా ఎలాంటి పని ఉండదు అయినప్పటికీ కొన్ని సంవత్సరాలపాటు చీని నిమ్మ పరిశోధనా స్థానంలో పనిచేస్తూ చినలాటరిపి ఉద్యాన కళాశాల మరియు అనంతరాజుపేట ఉద్యాన కళాశాలలో విశ్వావిద్యాలయం ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం విద్యార్థులకు పాఠాలు చెప్పేవారు ఆ క్రమంలో వేల రూపాయలు టి ఏ మరియు డి ఏ తీసుకునేవారు. అగ్రానమిస్ట్ కు ఉద్యాన పరిశోధన స్థానంలో అగ్రానమీ పోస్ట్ లేకపోయినా శాస్త్రీయంగా పనిలేకపోయినా విశ్వావిద్యాలయం లక్షలు జీతం చెల్లించింది. కళాశాలల్లో విద్యార్థులకు పాఠాలు చెప్పాల్సిన అగ్రానమిస్ట్ కు కళాశాలకు బదిలీ చేసినట్లు చేసి మళ్ళీ ఉద్యాన పరిశోధన స్థానం నుండి ఉద్యాన శాస్త్రవేత్తను బదిలీ చేసి అగ్రానమిస్ట్ ను పోస్ట్ చేస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వడం వెనుక మతలబ్ ఏంటని అనేకమంది రైతులు ప్రశ్నిస్తున్నారు. అంతేగాక రీజినల్ అకౌంట్స్ ఆఫీస్ తిరుపతిలో అసిస్టెంట్ కంప్ట్రోలర్ గా ఉన్న అధికారి ప్రస్తుత ఇంచార్జి వైస్ ఛాన్సలర్ ఉద్యాన కళాశాలలో అసోసియేట్ డీన్ గా ఉన్నప్పుడు అనేక తప్పుడు బిల్లులు పాస్ చెయ్యలేదని తాను చెప్పినట్లు చెయ్యలేదని వైస్ ఛాన్సలర్ అనుమతి లేకుండా ఎరుప్లేన్ లో ప్రయాణించిన తన అక్రమ టి ఏ బిల్లును తిరస్కరించారని అసోసియేట్ డీన్ అవినీతి పై విశ్వావిద్యాలయానికి ఫిర్యాదు చేసారనే కక్షతో నిజాయితీగా పనిచేసే అధికారిని చినలాటరిపి ఉద్యాన కళాశాలకు పరిపాలనా అధికారిగా బదిలీ చేసి గతంలో అసోసియేట్ డీన్ గా పెట్టిన అనేక తప్పుడు బిల్లులను ఏమీ చూడకుండా పాస్ చేసాడని మరియు తనకు అనుకూలంగా ఉన్నాడని ఉద్యాన కళాశాలలో పరిపాలనా అధికారిగా ఉన్నప్పుడు అనేక అవినీతి ఫిర్యాదులు ఆరోపణలు ఎదుర్కొన్న వ్యక్తిని అసిస్టెంట్ కంప్ట్రోలర్ గా బదిలీ చేసుకున్నాడని ఉద్యోగుల నుండి ఆరోపణలు ఉన్నాయి.ఏదేమైనా ఉద్యాన విశ్వవిద్యాలయానికి ఉద్యాన శాస్త్రవెత్తలానే వైస్ ఛాన్సలర్ గా నియమించాలని అలాగాక వ్యవసాయ శాస్త్రవేత్తను వైస్ ఛాన్సలర్ గా డైరెక్టర్లు గా డీన్లుగా నియమిస్తే ఇలాంటి నిర్ణయాలే ఉంటాయని ఈ వివాదాస్పద ఇంచార్జి వైస్ ఛాన్సలర్ను ప్రభుత్వం వెంటనే తొలగించాలని రైతులతో పాటు శాస్త్రవేత్తలు కూడా డిమాండ్ చేస్తున్నారు.

# సుప్రీంలో కెటిఆర్‌కు చుక్కెదురు

## క్వాష్ పిటిషన్ అత్యవసర విచారణకు నో

## 15న విచారిస్తామన్న చీఫ్ జస్టిస్ ఖన్నా

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు సుప్రీం కోర్టులో ఊరట లభించలేదు. ఆయన వేసిన క్వాష్ పిటిషన్‌ను శుక్రవారం విచారణకు తీసుకునేందుకు చీఫ్ జస్టిస్ నిరాకరించారు. ఈనెల 15న సుప్రీంలో కేటీఆర్ క్వాష్ పిటిషన్‌పై విచారణ జరుగనుంది. 15వ తేదీన విచారణకు లిస్ట్ చేసినందున అదే రోజు విచారిస్తామని సీజే స్పష్టం చేశారు. అప్పటి దాకా కేటీఆర్ క్వాష్ పిటిషన్‌ను విచారించాల్సిన అవసరం లేదని అభిప్రాయపడ్డారు. ఫార్ములా ఈ కార్ రేస్ కేసుకు సంబంధించి తెలంగాణ హైకోర్టు... కేటీఆర్ వేసిన క్వాష్ పిటిషన్‌ను కొట్టివేసిన విషయం తెలిసిందే. అలాగే మధ్యంతర ఉత్తర్వులను కూడా హైకోర్టు కొట్టివేసింది. దీంతో హైకోర్టు తీర్పును సవాల్ చేస్తూ సుప్రీం కోర్టులో కేటీఆర్ పిటిషన్‌ను దాఖలు చేశారు. అత్యవసరంగా విచారణకు తీసుకోవాలని కేటీఆర్ తరపు న్యాయవాదులు కోరినప్పటికీ సుప్రీం కోర్టు సీజెఐ నిరాకరించారు. హైకోర్టులో క్వాష్ పిటిషన్‌ను కొట్టేసిన వెంటనే సుప్రీం కోర్టులో కేటీఆర్ క్వాష్ పిటిషన్‌ను దాఖలు చేశారు. అయితే దాన్ని అత్యవసరంగా విచారించాల్సిన అవసరం లేదంటూ 15 విచారణ జరుపుతామంటూ ఆరోజు లిస్ట్ చేశారు. అయితే ఈరోజు కేటీఆర్ తరపు న్యాయవాదులు సీజెఐ ధర్మాసనం ముందు హాజరై.. ఇది చాలా సున్నితమైన అంశమని.. కేటీఆర్ అరెస్ట్ అయ్యే అవకాశం ఉన్నందున్న ఈరోజు లేదా రేపు విచారణ జరపాలని కేటీఆర్ న్యాయవాదు కోరారు. అయితే ఇది అంత అత్యవసరంగా విచారించాల్సిన అవసరం లేదని అభిప్రాయపడుతూ ఈనెల 15న విచారణకు లిస్ట్ చేసినందున ఇక ఆరోజే విచారస్తామని సంజీవ్ కన్నా నేతృత్వంలోని ధర్మాసనం స్పష్టం చేసింది.

# ఒక్కో సినిమాకు ఒక్కో తీరా..?

## గేమ్ ఛేంజర్‌కు ఎందుకు అదనపు షోలు

## సీఎం రేవంత్‌పై ఫైర్ అయిన ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్



**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రెండు నాల్కల ధోరణి మరోసారి నిరూపితమైందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ ధ్వజమెత్తారు. గేమ్ ఛేంజర్ సినిమాకు ఎందుకు అదనపు షోలు..? టికెట్ రేట్ల పెంపు ఎందుకు..? అని దేశపతి ప్రశ్నించారు. తెలంగాణ భవన్‌లో మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌తో కలిసి ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ మీడియాతో మాట్లాడారు. గేమ్ ఛేంజర్ సినిమాకు టికెట్ల రేట్ల పెంపు, అదనపు షోలకు అనుమతిస్తూ జారీ చేసిన జీవోతో రేవంత్ రెడ్డిది రెండు నాల్కల ధోరణి అని అర్థమైపోయింది. టికెట్ల పెంపుదల ఉండదు అని అసెంబ్లీ సాక్షిగా సినిమాటోగ్రఫీ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రతిజ్ఞ చేశారు. ఆయన ఇప్పుడు ఎక్కడ దాక్కున్నారు. ఈ జీవోపై వివరణ ఇవ్వాలి. గేమ్ ఛేంజర్ సినిమా వచ్చేసరికి రేట్ల పెంపుదలకు అవకాశం ఇచ్చారు. ఆయనకు ప్రత్యేకమైన ప్రివిలేజ్ ఎందుకు..? ఇక నుంచి బెనిఫిట్ షోలు, అదనపు షోలు ఉండవని సీఎం నెల రోజుల క్రితం అసెంబ్లీలో ప్రకటించారు. మరి గేమ్ ఛేంజర్‌కు ఎందుకు ప్రివిలేజ్ ఇస్తున్నారు అని దేశపతి శ్రీనివాస్ ప్రశ్నించారు. నిజానికి దిల్ రాజు అనే వ్యక్తి తెలంగాణ ఉద్యమంలో ఎప్పుడు కూడా కలిసి రాలేదు. ఏ ఒక్క రోజు కూడా తెలంగాణకు అండగా నిలబడలేదు. సంక్రాంతికి వస్తున్నాం ఫంక్షన్‌లో తెలంగాణ కల్చర్‌ను దిల్ రాజు అవమానించాడు. ఆయనకు ఆంధ్రాలోనే సినిమాలకు వైబ్ ఉంటుందంట. తెలంగాణలో వైబ్ ఉండదట. అయితే తెలంగాణలో సినిమాలు మానుకో దిల్ రాజు. కల్లు, మాంసం దుకాణాలు పెట్టుకో.. ఇక్కడ వైబ్ ఉంటుంది. నీకు కావాల్సింది వైబ్ కదా. ఇక్కడి సినిమాలకు వైబ్ ఉండదని అంటున్నవ్ కదా.. అని దేశపతి శ్రీనివాస్ మండిపడ్డారు. సినిమా టికెట్ రేట్లు పెంచమన్న రేవంత్ రెడ్డి పూటకోమాట మార్చుతున్నాడు. సినిమాటోగ్రఫి శాఖ మంత్రి టికెట్ రేట్ల పెంపుదల ఉండదని ప్రకటించారు. మరి దీనిపై సమాధానం చెప్పాలి. సినిమాలు విడుదలైతే టికెట్ రేట్లు పెంచి పేద ప్రజల జేబులు లూటీ చేయొద్దన్నాడు రేవంత్ రెడ్డి. మరి గేమ్ ఛేంజర్‌కు ఎందుకు పెంచాల్సిన అవసరం వచ్చింది. నిజాయితీ లేని ముఖ్యమంత్రి, మంత్రులు ఉండటం దురదృష్టకరమని ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ పేర్కొన్నారు.

# ఏసీబీ విచారణకు హాజరైన మాజీ మంత్రి కేటీఆర్

## ఫార్ములా-ఈ కారు రేసు ఒక్క రూపాయి అవినీతి జరగలేదు

## రేవంత్‌రెడ్డి హామీలపై నిరంతరం నిలదీస్తాం : కేటీఆర్



**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** ఫార్ములా-ఈ కారు రేసు వ్యవహారంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఏసీబీ విచారణకు హాజరయ్యారు. మాజీ ఏఏజీ, న్యాయవాది రామచంద్రరావుతో కలిసి కేటీఆర్ ఏసీబీ ఆఫీస్‌కు వెళ్లారు. అంతకుముందు నందినగర్‌లోని తన నివాసంలో లీగల్ టీమ్‌తో చర్చించారు. అందేవిధంగా ఎమ్మెల్యే హరీశ్ రావు, ఎమ్మెల్సీ కవిత, మాజీ మంత్రులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలతో సమావేశమయ్యారు. కాగా, కేటీఆర్ ఏసీబీ విచారణకు వెళ్తుండటంతో పార్టీ శ్రేణులు, నాయకులు పెద్ద సంఖ్యలో ఆయన నివాసానికి తరలివచ్చారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. 'తెలంగాణ బిడ్డగా, తెలంగాణ రాష్ట్రం కోసం పోరాటం చేసిన ఒక కార్యకర్తగా, కేసీఆర్ సైనికుడిగా స్వచ్ఛమైన మనసుతో, నిర్మలమైన హృదయంతో మరోసారి చెబుతున్నా.. తెలంగాణ ప్రతిష్ట పెంచడానికి, హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను అంతర్జాతీయం చేయడానికి, హైదరాబాద్‌ను ప్రపంచ పటంలో నిలపడానికి రాష్ట్ర మంత్రిగా ఎన్నో ప్రయత్నాలు చేశానన్నారు. అవి ఫలించి హైదరాబాద్, తెలంగాణ భారత దేశంలోనే ఒక ప్రధానమైన నగరంగా ప్రపంచ దృష్టిని ఆకర్షించే స్థాయికి తీసుకొచ్చేలా పనిచేశాం. తొమ్మిదిన్నర పదేండ్ల తమ ప్రభుత్వంలో మా బావమర్దులకు రూ.11 వందల 37 కోట్ల కాంట్రాక్టులు ఇచ్చే దౌర్భాగ్యపు పని చేయలేదని తెలిపారు. మంత్రిగా నేను మంత్రిమండలిలో కూర్చుని నా కొడుకు కంపెనీలకు కాంట్రాక్టులు ఇచుకోలేదని పేర్కొన్నారు. కాంట్రాక్టులు ఇచ్చి ప్రతిఫలంగా ల్యాండ్‌క్రూజర్ కొనుక్కోలేదు. ఆ పనులు రేవంత్ రెడ్డి, ఆయన మంత్రివర్గ సహచరులు చేశారన్నారు. ఆ చావు తెలివితేటలు, అవినీతి తెలివితేటలు వాళ్లకే ఉన్నాయని పేర్కొన్నారు. నేను రూ.55 లక్షతో ఎమ్మెల్యేలను కొనుగోలు చేయడానికి పోయి దొరికిపోయిన దొంగను కూడా కాదని తెలిపారు. నేను నిఖార్సయిన తెలంగాణ బిడ్డఅని తేల్చిచెప్పారు. ఏ పనిచేసినా తెలంగాణ కోసం, హైదరాబాద్ ప్రతిష్టను పెంచడానికి చేశానని తెలిపారు. అరపైసా అవినీతి చేయలేదని, చేయబోను అని అన్నారు. కొంత మంది అర్థమై కానివాళ్లు, తెలిసీ తెలియని వాళ్లు, ఏదో కొంత బురదజల్లి తాత్కాలికంగా మీడియా మేనేజ్‌మెంట్ ద్వారా రాజకీయ పబ్బం గడుపుకోవాలనుకునే కాంగ్రెస్ వాళ్లకు చెప్పేదొకటే.. నిజం నిలకడమీద తెలుస్తుందన్నారు. మీరు ఇవ్వాళ జల్లే బురద నన్నుగానీ, మా పార్టీని కానీ ఎట్టి పరిస్థితుల్లో మాదృష్టిని మరల్చలేదన్నారు. మేము మాట్లాడుతూనే ఉంటాం. కొట్లాడుతూనే ఉంటాం. గత ఏడాది కాలంగా విద్యుత్ చార్జీలు పెంచొద్దని కొట్లాడింది బీఆర్ఎస్. లగచర్లలో రైతులను జైల్లో పెడితే అడ్డుకున్నది బీఆర్ఎస్. హైడ్రా పేరుతో ఇండ్లు కూలగొడితే అడ్డుకున్నది బీఆర్ఎస్. ఆరు గ్యారంటీలను అమలు చేయకపోతే అడుగడుగునా నిలదీసింది కేసీఆర్ బృందం. మా దృష్టిని మేం మరల్చం. నామీద కేసుపెట్టి నన్నేదో చేసి దానివల్ల మా పార్టీ క్యాడర్‌ను, నాయకత్వాన్ని నువ్వు దారి మళ్లింపు, దృష్టి మళ్లింపు దిశగా ప్రయత్నం చేస్తానని అనుకుంటున్నవ్ రేవంత్ రెడ్డి. అది నీవల్ల కాదు. ముమ్మాటికీ నువ్విచ్చిన 420 హామీలపై ప్రశ్నిస్తూనే ఉంటాం. ఇదే కాదు ఎన్ని కేసులు పెట్టినా ఎదుర్కొంటాం. న్యాయస్థానాలపై, ఈ దేశంలోని చట్టాల మీద, భారత రాజ్యాంగంపై మాకు సంపూర్ణ గౌరవం, విశ్వాసం ఉన్నది. నువ్వు ఏ ప్రశ్నలన్నా అడుగు సమాధానం మావద్ద ఉంది. ఎందుకంటే మేం నిజాయితీగా ఉన్నాం. నీలాగా లుచ్చా పనులు చేయలేదు, తుచ్చపు పనులు చేయలేదు. చేయబోము. నికార్సయిన తెలంగాణ బిడ్డగా.. కేసీఆర్ రక్తం పంచుకుని పుట్టిన కొడుకుగా చెబుతున్నా.

# విద్యాశాఖ సెక్రెటరీగా సీనియర్ ఐఏఎస్ అధికారిణి యోగితా రాణా



**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** విద్యాశాఖ సెక్రెటరీగా సీనియర్ ఐఏఎస్ అధికారిణి యోగితా రాణా నియమితులయ్యారు. 2003 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన రాణా.. ప్రస్తుతం సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శిగా భాద్యతలు నిర్వహిస్తున్నారు. అయితే విద్యాశాఖ సెక్రెటరీగా ఉన్న బుర్రా వెంకటేశంను రాష్ట్ర ప్రభుత్వం గతేడాది డిసెంబర్‌లో టీజీపీఎస్సీ చైర్మన్‌గా నియమించింది. దీంతో ఎన్ శ్రీధర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. తాజాగా యోగితా రాణాను సెక్రెటరీగా నియమించడంతో శ్రీధర్‌ను ఆ బాధ్యతల నుంచి విద్యాశాఖ రిలీవ్ చేసింది. కాగా, ఎన్. శ్రీధర్‌కు గనుల శాఖ కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగించింది. అదేవిధంగా 2006 బ్యాచ్‌కు చెందిన కే. సురేంద్ర మోహన్‌ను రవాణా శాఖ కమిషనర్‌గా ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఆదేశాలు జారీచేశారు. యోగితా రాణా.. 2003 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారిణి. 2002లో సివిల్ సర్వీసెస్‌లో మూడో ప్రయత్నంలో ఐఆర్‌టీఎస్‌కు ఎంపికయ్యారు. 2003లో సివిల్స్‌లో నాలుగో ప్రయత్నంలో ఐఏఎస్‌కు ఎంపికయ్యారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించడంతో విశాఖ జిల్లాలో ఏడాదిపాటు శిక్షణ తీసుకున్నారు. అనంతరం భద్రాచలం సబ్ కలెక్టర్‌గా, రంపచోడవరం ఐటీడీఏ పీఓగా పనిచేశారు. ఆ తర్వాత యూఎన్‌డీపీలో మూడున్నరేండ్లు బాధ్యతలు నిర్వహించారు. 2017లో నిజామాబాద్ జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తూ 'ఈ-నామ్' అమలులో జాతీయ స్థాయిలో ప్రధాని మోదీ చేతులమీదుగా అవార్డు అందుకున్నారు.

# నల్లగొండ జిల్లాలో దొంగలు బీభత్సం

**నల్లగొండ,(క్రైమ్ మిర్రర్):** నల్లగొండ జిల్లాలో దొంగలు బీభత్సం సృష్టించారు. వరుస దొంగతనాలకు పాల్పడుతూ అందిన కాడికి దోచుకొని పరారయ్యారు. వివరాల్లోకి వెళ్తే..మునుగోడు మండల కేంద్రంలో దొంగలు హడలెత్తించారు. వరుసగా ఐదు చోట్ల చోరీకి పాల్పడ్డారు. దుండగులు తాళాలు వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేసి దోపిడీకి పాల్పడ్డారు. మండల కేంద్రానికి చెందిన నాగరాజు స్వీట్ హౌస్‌లో రూ.70,000 నగదు, వారి ఇంట్లోనే 12 తులాల బంగారాన్ని ఎత్తుకెళ్లారు. వడ్డెర గూడెంకు చెందిన ముద్దంగుల నర్సింహా ఇంట్లో రెండు లక్షల యాభై వేల నగదు అపహరించినట్లు సమాచారం. ఇదే గ్రామానికి చెందిన రాసమల్ల శ్రీరాములుకు చెందిన బైక్ అపహారణకు గురైంది. మునుగోడు లోని వెనిగల పురుషోత్తమ్ ఇంట్లో రూ.60,000 నగదు, అరకిలో వెండి ఎత్తుకెళ్లారు. ఫారెస్ట్ ఆఫీస్‌లో సైతం దొంగతనం జరుగడం విశేషం. కాగా, వరుస దొంగతనాలతో స్థానిక ప్రజలు భయాందోళనలకు గురవుతు న్నారు. నిందితులను త్వరగా పట్టుకొని రక్షణ కల్పించాలని కోరుతున్నారు.

# తిరుమలలో తొక్కిసలాట ఘటన దురదుష్టకరం : శ్రీనివాస్‌గౌడ్



**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** తిరుమలలో తొక్కిసలాట ఘటన దురదృష్టకరం, బాధాకరమని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. తొక్కిసలాటలో చనిపోయిన మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేస్తున్నామని శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. తెలంగాణ భవన్‌లో శ్రీనివాస్ గౌడ్ మీడియాతో మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి, టీటీడీ బోర్డుకు విజ్ఞప్తి.. ఇలాంటి ఘటనలు జరగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేసుకోవాలి. లోపాలను సరిదిద్దుకోవాల్సిన అవసరం ఉంది. తిరుమల బ్రహ్మోత్సవాలు, వైకుంఠ ఏకాదశి సందర్భాల్లో అత్యధిక భక్తులు తెలంగాణ, తమిళనాడు నుంచి భారీగా తరలివచ్చే అవకాశం ఉంది. కాబట్టి ఈ రెండు రాష్ట్రాలతో మాట్లాడి అదనపు సిబ్బందిని సమకూర్చుకోవాలి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలి. గాయపడిన వారికి మెరుగైన చికిత్స నిమిత్తం హైదరాబాద్‌కు పంపించాలని కోరుతున్నాం అని శ్రీనివాస్ గౌడ్ సూచించారు. హైదరాబాద్‌లో టీటీడీ కార్యాలయం ఉంది. ఇక్కడ బుకింగ్ సౌకర్యాలు ఏర్పాటు చేస్తే ఇలాంటి పరిస్థితి తలెత్తదు. టోకెన్లు దొరక్కపోయినా చాలా మంది వెళ్లడంతో తొక్కిసలాట జరిగే అవకాశం ఉంది. కాబట్టి హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాల్లో టోకెన్లు ఇవ్వాలి. తిరుమలలో తెలంగాణ ప్రజాప్రతినిధుల లేఖలను అనుమతించాలన్న ప్రతిపాదనను టీటీడీ బోర్డు స్వీకరించినందుకు సంతోషం. తమ వ్యాఖ్యలపై రకరకాల విమర్శలు వచ్చినప్పటికీ మేం అడిగిన దాంట్లో ధర్మం ఉందని న్యాయం చేశారు. తెలంగాణలో చాలా వరకు ప్రతి ఇంటి దైవం వెంకటేశ్వర స్వామి కాబట్టి.. దర్శనాల టోకెన్ల కోసం తెలంగాణలో కూడా కౌంటర్లు ఏర్పాటు చేయండి. తెలంగాణ భక్తులు సేవ చేసేందుకు సిద్ధంగా ఉన్నారని శ్రీనివాస్ గౌడ్ తెలిపారు.

# జిహెచ్‌ఎంసి వద్ద కంట్రాక్టర్ల మెరుపు ధర్నా

## బకాయిల చెల్లింపు కోసం డిమాండ్

## పెట్రోల్ పోసుకుని కొందరు ఆత్మహత్యాయత్నం

## కంట్రాక్టర్లతో చర్చించిన కమిషనర్ ఇలంబర్తి

**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** హైదరాబాద్ మహానగర పాలక సంస్థ జీహెచ్ఎంసీ కార్యాలయం ఎదుట బల్దియా కాంట్రాక్టర్లు మెరుపు ధర్నాకు దిగారు. గురువారం ఉదయం కాంట్రాక్టర్లంతా ధర్నాకు దిగారు. పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలంటూ వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తక్షణమే తమకు రావాల్సిన బకాయలు రూ. 1100 కోట్లు చెల్లించాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆ క్రమంలో ఓ కాంట్రాక్టర్.. ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నానికి పూనుకొన్నాడు. అక్కడే ఉన్న సహచర కాంట్రాక్టర్లు.. అతడి ప్రయత్నాన్ని అడ్డుకొన్నారు. దీంతో స్థానికంగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. జీహెచ్ఎంసీ బిల్లులు చెల్లించకపోవడంతో అప్పుల బాధతో కాంట్రాక్టర్లు ఆత్మహత్యలు చేసుకుంటున్నారనీ ఈ సందర్భంగా వారు ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలంటూ కాంట్రాక్టర్లు ఆందోళనకు దిగారు. కార్యాలయం ప్రధాన ద్వారం ముందు బైఠాయించిన కాంట్రాక్టర్లు.. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఏడాదిగా బిల్లులు చెల్లించడం లేదని కాంగ్రెస్ సర్కార్‌పై మండిపడ్డారు. ఇంతలోనే ఉన్నట్టుండి ఇద్దరు కాంట్రాక్టర్లు పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నం చేశారు. తోటి కాంట్రాక్టర్లు వారిని అడ్డుకుని పెట్రోల్ బాటిళ్లను లాగేసుకున్నారు. అప్రమత్తమైన జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి.. కాంట్రాక్టర్లను చర్చలకు పిలిచారు. పెండింగ్ బిల్లులపై కమిషనర్ ఇలంబర్తి.. కాంట్రాక్టర్లతో చర్చలు జరిపారు. పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన కాంట్రాక్టర్లను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. వారిద్దరి ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు తెలుస్తోంది.

# మాజీ మంత్రి హరీశ్‌రావు గృహ నిర్బంధం

## కోకాపేటలోని ఆయన గృహం వద్ద భారీగా మోహరించిన పోలీసులు



**హైదరాబాద్, (క్రైమ్ మిర్రర్):** బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులపై కాంగ్రెస్ ప్రభుత్వం అక్రమ నిర్బంధాలు కొనసాగిస్తున్నది. అక్రమ కేసులు, ముందస్తు అరెస్టులు, గృహ నిర్బంధాలు విధిస్తూ ప్రజల్లోకి వెళ్లకుండా అడ్డుకోవాలని చూస్తున్నది. ఇందులో భాగంగా సిద్దిపేట ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత హరీశ్‌రావును పోలీసులు గృహ నిర్బంధం చేశారు. గురువారం ఉదయంమే కోకాపేటలోని ఆయన నివాసం వద్ద పోలీసులు భారీగా మోహరించారు. ఇంట్లో నుంచి బయటకు రాకుండా అడ్డుకున్నారు. హరీశ్‌రావును కలవడానికి కూడా ఎవరినీ అనుమతించడం లేదు. ఫార్ములా-ఈ కార్ రేస్ కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గురువారం ఏసీబీ విచారణకు హాజరు కానున్నారు. ఈ నేపథ్యంలో పార్టీ నేతలను పోలీసులు హౌస్ అరెస్టులు చేస్తున్నారు. కాగా, ఏసీబీ విచారణకు న్యాయవాదితో వెళ్లేందుకు హైకోర్టు అనుమతించిన విషయం తెలిసిందే. రెండు రోజుల క్రితం కేటీఆర్ వెంట న్యాయవాదిని అనుమతించకపోవడాన్ని హైకోర్టు తప్పుపట్టింది. కేటీఆర్‌ను విచారించే ఏసీబీ కార్యాలయంలో దర్యాప్తు గదికి పకనే ఉన్న గ్రంథాలయ గదిలో న్యాయవాది ఉండేందుకు అనుమతించాలని స్పష్టం చేసింది. దర్యాప్తు ప్రక్రియను ఆడియో, వీడియో రికార్డింగ్ చేయాలన్న ప్రతిపాదన పట్ల సానుకూలంగా స్పందించలేదు. గురువారం జరిగే విచారణ తీరును బట్టి అవసరమైతే పిటిషనర్ మళ్లీ కోర్టుకు రావచ్చని తెలిపింది. ఈ మేరకు జస్టిస్ కే లక్ష్మణ్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నెల 6న ఏసీబీ దర్యాప్తుకు న్యాయవాదిని వెంటబెట్టుకుని వెళ్తే పోలీసులు అనుమతించకపోవడాన్ని సవాలు చేస్తూ కేటీఆర్ దాఖలు చేసిన లంచ్ మోషన్ పిటిషన్‌పై బుధవారం భోజన విరామ సమయంలో హైకోర్టు అత్యవసర విచారణ జరిపింది.

## ఎడిటోరియల్



# వైకుంఠ ఏకాదశినాడు ఆచరించవలసిన విధులు

శేషతల్పం మీద శయనించే విష్ణుమూర్తిని దర్శించుకునేందుకు ముక్కోటి దేవతలు వైకుంఠానికి తరలివెళ్లే సందర్భం- వైకుంఠ ఏకాదశి. భక్తులందరికీ పరమ పవిత్రమైన ఈ రోజున ఆస్తికులు ఆచరించాల్సిన విధుల గురించి పెద్దలు ఈ విధంగా చెబుతున్నారు.

**పూజజి**

వైకుంఠ ఏకాదశి రోజున సూర్యోదయానికి ముందే నిద్రలేవాలి. నదీస్నానం అందరికీ సాధ్యం కాదు కాబట్టి, ఇంట్లేనే అయినా తలస్నానం మాత్రం చేయడం మంచిది. స్నానానంతరం పూజాగదిని శుభ్రపరచుకుని తోరణాలతో అలంకరించాలి. వైకుంఠ ఏకాదశి విష్ణుమూర్తికి ప్రశస్తమైన తిథి కాబట్టి, ఆయన ప్రతిమను కొలుచుకోవాలి. కొందరి ఇళ్లలో ఈ రోజున విష్ణుమూర్తికి కలశం పెట్టే ఆచారం కూడా కనిపిస్తుంది. పూలతో పాటుగా హరికి ప్రీతిపాత్రమైన తులసీదళాలతో ఆ స్వామిని పూజించుకోవాలి.

**ఉత్తరద్వార దర్శనం**

ఈ రోజున విష్ణుమూర్తిని వైకుంఠద్వారం వద్ద దర్శించుకున్న మధుకైటభులనే రాక్షసులకి శాపవిమోచనం కలగడంతో... తమలాగానే వైకుంఠద్వారాన్ని పోలిన ద్వారం ద్వారా హరిని దర్శించుకునేవారికి మోక్షం కలగాలని వారు కోరుకున్నారట. ఉత్తర దిక్కు జ్ఞానానికి సూచన కాబట్టి.. ఇహలోకంలో కొట్టుమిట్టాడుతున్న తమ మనసుకి పరిపక్వత కలిగించమంటూ ఆ భగవంతుని వేడుకోవడం ఈ ఉత్తర ద్వార దర్శనంలోని ఆంతర్యంగా కనిపిస్తుంది. కాబట్టి ఒకవేళ గుడికి వెళ్లడం కుదరని పక్షంలో ఆందోళన చెందకుండా, ఉన్నచోటే ఆ హరిని ధ్యానించుకుంటూ తనలోని అజ్ఞానాన్ని తొలగించి, శాశ్వతమైన శాంతిని ప్రసాదించమని వేడుకోవాలంటూ పెద్దలు సూచిస్తున్నారు.

**ఉపవాసం**

ఏడాది పొడవునా ఏ ఏకాదశి రోజున ఉపవాసం చేయడం కుదరకున్నా, ముక్కోటి ఏకాదశి రోజున ఉపవాసం ఉంటే అపార ఫలితం దక్కుతుందంటారు. మనలో ఐదు కర్మేంద్రియాలు, ఐదు జ్ఞానేంద్రియాలు, మనసు... ఇలా మొత్తం కలిపి ఏకాదశ (పదకొండు) ఇంద్రియాలు ఉంటాయట. ఈ ఏకాదశ ఇంద్రియాలనూ ఆ హరికి అర్పించే అరుదైన అవకాశమే ఏకాదశి వ్రతం. ఇందుకోసం ముందురోజు రాత్రి నుంచే ఉపవాసం ఉండి, ఏకాదశి రోజున కేవలం తులసి తీర్థాన్నే స్వీకరిస్తూ, మర్నాడు ఉదయం ఎవరికన్నా అన్నదానం చేసిన పిదప భుజించాలి.

**జాగరణజి**

ఏకాదశి రోజు రాత్రి భగవన్నామస్మరణతో జాగరణ చేయాలి. ఇలా జాగరణతో మనసునీ, ఉపవాసంతో శరీరాన్నీ అదుపు చేసుకుని... వాటిని హరిధ్యానంలోకి మరల్చడమే ఏకాదశి వ్రత ఉద్దేశం. అందుకనే లౌకికమైన ఆలోచనలు వేటికీ తావివ్వకుండా కేవలం హరినామస్మరణ మీదే మనసుని లగ్నం చేయాలని చెబుతారు. ఈ కాలంలో బ్రహ్మచర్యాన్ని కూడా పాటించాలని హెచ్చరిస్తారు. ఇలా నిష్ఠగా ఏకాదశి వ్రతాన్ని చేసినవారికి ఇహపర శాంతి లభిస్తుందని చెప్పేందుకు ఎన్నో గాథలు ప్రచారంలో ఉన్నాయి. పూర్వం సుకేతుడనే రాజు వైకుంఠ ఏకాదశి రోజున ఉపవాస వ్రతాన్ని ఆచరించి సంతానాన్ని పొందాడు కాబట్టి, ఈ ఏకాదశిని పుత్రద ఏకాదశి అని కూడా పిలుస్తారు.

దక్షిణామూర్తి జ్యోతిష్యాలయం
బ్రహ్మశ్రీ కొండోజు సాల్వాచార్యులు లి పంచాంగ సిద్ధాంతి
జ్యోతిష వాస్తు పురోహితులు
93926 96456: 9666075431

తిరుపతిలో దారుణం జరిగింది. వైకుంఠ ఏకాదశి దర్శన టిక్కెట్ల కోసం వచ్చిన ఆరుగురు భక్తులను టిటిడి నిర్లక్ష్యం ఏకంగా వైకుంఠం చేర్చారు. వేలకోట్ల ఆదాయం..వందల్లో ఉద్యోగులు..వేలమంది పోలీసులు.. ఇంతమంది ఉన్నా కనీసం టోకెన్లు సక్రమంగా అందించడం కూడా రాని దౌర్భాగ్యం కనిపించింది. మొన్నటికి మొన్న పుష్ప సినిమా సందర్భంగా హైదరాబాద్ సంధ్య థియేటర్‌లో ఓ మహిళ మృత చెందింది. ఆమె కుమారుడు చావుబతుకుల్లో ఆస్పత్రి బెడ్‌పై పోరాడుతున్నాడు. గతంలో ఆలయాల్లో కూడా తొక్కిసలాట ఘటలను చూశాం. ఇవన్నీ గుణపాఠాలు. ఇలాంటివి చూసినప్పుడు ఎలా ఉండకూడదో నేర్చుకోవాలి. తిరుమల లాంటి ప్రదేశాల్లో మరీ అవసరం. కానీ అలా జరగడం లేదు. సాధారణ రోజుల్లో తొక్కిసలాటలే..పర్వదినాల్లో కూడా అలాగే జరిగితే ఎలా అన్నది ఆలోచన చేయాలి. అయితే వైకుంఠ ద్వార దర్శనం కోసం ముందే టిక్కెట్లు అమ్మడం లేదా, టోకెటన్లు ఇవ్వడం అన్న దౌర్భాగ్యం ఏమిటో అర్థం కాదు. ఇంతగా ప్రచారం చేసి భక్తులను రప్పించి, సరిగా ఏర్పాట్లు చేయకుండా తొక్కిసలాటకు కారణమైన టిటిడి అధికారుల నిర్లక్ష్యం ఏ మాత్రం క్షంతవ్యం కాదు. అలా కాకుండ రెండ్రోజుల ముందే భక్తులు వచ్చేలా చేసి, క్యూలైన్ల వద్ద పడిగాపులు కాచేలా చేయడం ఎంతవరకు సమంజసమో టిటిడి పెద్దలు చెప్పాలి. శ్రీవారిమీద భక్తితో వేలకోట్లు టిటిడికి భక్తులు చెల్లిస్తున్నా విఐపిల



# టిటిడి నిర్లక్ష్యానికి పరాకాష్ట!

పోలీసుల ప్రేక్షక పాత్ర ఇక్కడ స్పష్టంగా కనిపించింది. ఇప్పుడు కూడా అదే కనిపించింది. టిటిడి ఛైర్మన్, ఇవో, అదనపు ఇవో ఇలా అనేకమంది నెలరోజుల ముందునుంచే అనేక రకాలుగా సమీక్షలు చేశారు. అట్టహాసం ప్రకటించారు. కానీ జరగాల్సిన నష్టం జరిగింది. వైకుంఠ ఏకాదశి సర్వదర్శన టోకెన్ల జారీలో తొక్కిసలాట జరిగి ఆరుగురు భక్తులు ప్రాణాలు కోల్పోవడం దారుణమైన ఘటనగానే భావించాలి. టోకెన్ల జారీకి తిరుపతిలోని తొమ్మిది ప్రాంతాల్లో 90 కౌంటర్లు ఏర్పాటు చేయగా... బైరాగిపట్టెడ వద్ద ఈ దారుణం జరిగింది. దైవదర్శనం కోసం వచ్చే భక్తులు రెండు రోజులముందే టోకెన్లు పొందాలని నిబంధన పెట్టడమే దారుణం. అలా కాకుండా తిరుమలలో క్యూలైన్లలో వచ్చిన వారికే దర్శనం కల్పించివుంటే ఈ దారుణం జరిగివుండేది కాదు. తిరుపతిలో టోకెటనలు పొందాలనడమే దారుణం. క్యూలైన్లో ఉన్న భక్తులను ఒక్కసారిగి విడిచిపెట్టడంతో తోపులాట జరిగిందని, ఒకరినొకరు తోసుకుంటూ పోవడంతో ఈ ఘటన జరిగిందని అక్కడ ఉన్నవారు చెబుతున్నారు. సరిగా భద్రత లేదని 3, 4గురు పోలీసులు ఉన్నారని.. తొక్కిసలాట జరిగినప్పుడు 20 మంది వరకు వచ్చారని తెలిపారు. నాలుగు లైన్లలో ఉన్నవారిని ఒక్కసారి వదలడంతో ఈ సమస్య వచ్చిందని అంటున్నారు. ప్రతి ఏడాది తాము వైకుంఠ ఏకాదశికి తిరుమల వస్తామని, ఇలా జరగడం ఇది మొదటిసారని భక్తులు తెలిపారు. నిజానికి ఆన్‌లైన్‌లో టిక్కెట్లు జారీ చేసినా, లేకుంటే దర్శనం కోసం నేరుగా వచ్చిన వారికి మాత్రమే టోకెన్లు జారీ చేసినా ఈ దుర్ఘటన జరిగివుండేది కాదు. కానీ సేవలు తరిస్తున్నారు. వారికే దర్శనం విషయంలో పెద్దపీట వేస్తున్నారు. కొండపైనే ఏర్పాట్లు చేసి, టోకెన్లు ఇచ్చి ఉంటే ఈ తొక్కిసలాట జరిగేదికాదు. తిరుపతిలో టిక్కెట్లు ఇవ్వడంతో భక్తుల సంఖ్య పెరిగిందని దానికి తగ్గట్టుగా పోలీసు భద్రత లేదని అరథం అవుతోంది. భక్తులను క్యూలో ఒక్కసారిగి విడిచిపెట్టకూడదని.. ఒక్కొక్క క్యూలైన్ విడిచిపెడితే తొక్కిసలాట జరిగేది కాదని కూటా అంటున్నారు. ఒకటో కంపార్టుమెంట్ నుంచి వదిలితే బాగుండేదని, అలా కాకుండా 4, 5 క్యూలైన్లు విడిచిపెట్టారని దీంతో అంతా ఒకేసారి రావడంతో తోపులాట జరిగిందని భక్తులు తెలిపారు. ఒక్కసారిగా గేట్ తీసినప్పుడు భక్తులంతా తోసుకుని వచ్చారని.. తెలిపారు. పురుషులు కూడా మహిళలు, పిల్లలు ఉన్నారని చూసుకోవడం లేదని తోసుకుంటూ వచ్చారని అర్థం అవుతోంది. నిజానికి శ్రీవారి దర్శనం కోసం వచ్చే భక్తుల విషయంలో ఆదినుంచీ టిటిడిది నిర్లక్ష్యమే. వేలమంది వస్తుంటే అందుకు తగ్గట్లుగా ఏర్పాట్లు చేయకుండా..విఐపిలను ప్రసన్నం చేసుకునే పనిలో ఉంటున్నారు. గురువారం అర్ధరాత్రి నుంచి తిరుమలలో వైకుంఠ ద్వారాలు తెరుచుకోనున్నాయి. దీని కోసం టీటీడీ విస్తృత ఏర్పాట్లు చేసిందని చెబుతోంది. తిరుపతిలో ఏర్పాటు చేసిన కేంద్రాల్లో గురువారం తెల్లవారుజామున 5 గంటల నుంచి టోకెన్లను జారీ చేయాలని టీటీడీ యంత్రాంగం తొలుత నిర్ణయించింది. అయితే... బుధవారం మధ్యాహ్నం నుంచే కేంద్రాల వద్దకు భారీగా భక్తులు తరలి రావడం మొదలైంది. రాత్రి 8 గంటలకు ఒత్తిడి మరింత పెరిగింది. క్యూలైన్లలోకి రాత్రి 9 గంటల నుంచి భక్తులను పంపించడం మొదలుపెట్టారు. దీంతో కేంద్రాల వెలుపల నిరీక్షిస్తున్న భక్తులు క్యూలైన్లలో ప్రవేశించడానికి ప్రయత్నించే క్రమంలో తొక్కిసలాటలు జరిగాయి. మరీ ముఖ్యంగా... బైరాగిపట్టెడ, విష్ణు నివాసం, ఇందిరా మైదానం కేంద్రాల వద్ద తొక్కిసలాటలు జరిగాయి. ఈ ఘటనలో ఆరుగురు భక్తులు మృతిచెందగా.. పలువురు గాయపడ్డరు. వారిని రుయా ఆస్పత్రికి తరలించారు. నిజానికి ఇక్కడ భక్తులను అదుపు చేయడానికి అవసరమైన ఏర్పాట్లు కానీ, తగిన పోలీసు సిబ్బంది కానీ లేదని అర్థం అవుతోం. వైకుంఠద్వార దర్శనం టోకెన్ల కోసం పెద్ద సంఖ్యలో భక్తులొస్తారని తెలిసీ.. అందుకు తగ్గట్లు ఎందుకు ఏర్పాట్లు చేయలేదని స్పష్టంగా తెలుస్తోంది. విధుల్లో అత్యంత అప్రమత్తంగా ఉండాల్సిన బాధ్యత లేకుండా టిటిడి అధికారులు వ్యవహరించారు. ఉన్నతస్థాయి దర్యాప్తు జరిపి, బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన అందరిపైనా కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంది. ఇకపోతే సాధారణ రోజుల్లో కూడా తిరుమలలో కంపార్టుమెంట్లలో కూచోబెట్టడం, ఒక్కసారిగా వదలడం, తోపులాట జరిగేలా చేస్తున్నారు. తిన్నగా భక్తులు స్వామిని దర్శించుకునే పరిస్థితి లేదు. తిరుమల విధానాల్లో సంస్కరణలు రావాలి. నేరుగా వచ్చే భక్తులు దర్శనం చేసుకునే వెసలుబాటు ఉండాలి. ఆన్‌లైన్‌తో పాటు, ఆఫ్‌లైన్ విధానం బలపడాలి. శ్రీవాణి టిక్కెట్లు పొందిన భక్తులను కూడా క్యూలో తోసేస్తున్నారు. వారు టిక్కుట్లు పొందాక సరైన వసతి కల్పించడం లేదు. వసతి కోసంమరోచోటికి పరుగెత్తాలి. అక్కడ రాజముద్ర వేసుకున్నాక మరోచోటికి పరుగెత్తాలి. ఇలాంటి గందరగోళం లేకుండా సింగిల్ విండో విధానంలో దర్శనం, వసతి టిక్కెట్లు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలి. అలాగే తాజా దుర్ఘటన నేపథ్యంలో తిరుమలలో సంస్కరణలకు శ్రీకారం చుట్టాలి.

# తిరుపతి ఘటనపై భిన్న వాదనలు

### డిఎస్పీ అత్యుత్సాహంతోనే ఘటన
### తగినంత మంది పోలీస్ సిబ్బంది లేకపోవడంతో దుర్ఘటన

పవిత్ర వైకుంఠ ఏకాదశి రోజున తిరుమల శ్రీవారిని దర్శించుకోవాలని భావించిన వారు టోకెన్లు తీసుకునే లోపే తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోయారు. గతంలో ఎన్నడూ లేని విధంగా తిరుపతిలో జరిగిన తొక్కిసలాట ఘటన అందరినీ తీవ్రంగా కలిచివేసింది. అసలు ఈ దుర్ఘటనకు సంబంధించి తప్పు ఎవరిదనే దానిపై భిన్న వాదనలు వినిపిస్తున్నాయి. టోకెన్లు తమ వరకూ రావేమో అని కొందరు భక్తులు అత్యుత్సాహం ఓ కారణమంటూ కొందరు వాదిస్తున్నారు. అయితే, అధిక సంఖ్యలో భక్తులు వస్తారని తెలిసినా తగిన రీతిలో అధికారులు, పోలీసులు ఏర్పాట్లు చేయలేదని కొందరు విమర్శిస్తున్నారు. పోలీసుల అత్యుత్సాహం కూడా దీనికి కారణమని భావిస్తున్నారు. ఓ సెంటర్ వద్ద భక్తురాలు అస్వస్థతకు గురి కావడంతో డీఎస్పీ గేట్లు తెరవడంతోనే తోపులాట జరిగిందని ఇప్పటికే టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు ప్రకటించారు. మరోవైపు, ఈ ఘటనపై సీఎం చంద్రబాబుకు అధికారులు నివేదిక అందజేశారు. 'తొక్కిసలాట జరిగినా డీఎస్పీ సరిగా స్పందించలేదు. ఎస్పీ వెంటనే సిబ్బందితో వచ్చి భక్తులకు సాయం చేశారు. అంబులెన్స్ వాహనాన్ని టికెట్ కౌంటర్ బయట పార్క్ చేసి డ్రైవర్ వెళ్లిపోయాడు. 20 నిమిషాలైనా అతను అందుబాటులోకి రాలేదు. డీఎస్పీ, అంబులెన్స్ డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే భక్తులు చనిపోయారు.' అని అధికారులు నివేదికలో పేర్కొన్నారు. ఈ ఘటనలో గాయపడ్డ క్షతగాత్రులను టీటీడీ ఛైర్మన్ సహా ఈవో, జేఈవో, ఇతర అధికారులు పరామర్శించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించేలా అక్కడే ఉండి పర్యవేక్షిస్తున్నారు. 48 మంది గాయపడగా.. 40 మందిని డిశ్చార్జి చేసినట్లు తెలుస్తోంది. మిగిలిన 8 మంది చికిత్స పొందుతున్నారు. తిరుపతిలోని 8 కేంద్రాల వద్ద స్లాటెడ్ సర్వదర్శనం టోకెన్ల జారీకి అధికారులు ఏర్పాట్లు చేయగా.. ఈ నెల 10, 11, 12 తేదీలకు సంబంధించి మొత్తం 1.20 లక్షల టోకెన్లు జారీ చేయనున్నట్లు ప్రకటించారు. గురువారం ఉదయం 5 గంటలకు టోకెన్లు జారీ చేస్తామని తెలపగా.. బుధవారం ఉదయం నుంచే రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో క్యూలైన్లలో వేచి ఉన్నారు. బైరాగిపట్టెడలోని రామానాయుడు పాఠశాల వద్ద తాకిడి తక్కువగా ఉంటుందని భావించిన భక్తులు బుధవారం ఉదయం పదింటికే అక్కడికి చేరుకున్నారు. రాత్రికి పరిసర ప్రాంతాలన్నీ రద్దీగా మారాయి. దీంతో పోలీసులు పక్కనే ఉన్న పద్మావతి పార్కులోకి భక్తులను వదిలి.. రాత్రి 8:20 గంటలకు క్యూలైన్‌లోకి అనుమతించారు. ఈ క్రమంలో తోపులాట జరగ్గా.. కొంతసేపు భక్తులను నిలిపేసి సహాయ చర్యలు చేపట్టారు. దీంతో ప్రాణనష్టం తగ్గింది. గాయపడ్డ భక్తులను అంబులెన్సులో పోలీసులు రుయా, స్విమ్స్ ఆస్పత్రులకు తరలించారు. ఈ కేంద్రం వద్ద బారికేడ్లు ఏర్పాటు చేయకపోవడంపైనా విమర్శలు వస్తున్నాయి. భక్తులను పార్కులో ఉంచి ఒకేసారి అనుమతించడంతో ప్రాణనష్టం జరిగిందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. టీటీడీ అధికారులు ఏర్పాట్లలో విఫలమయ్యారని భక్తులు ఆరోపిస్తున్నారు. మధ్యాహ్న 2 గంటలు - భక్తులతో నిండిన పార్కు అదుపు చేసేందుకు పోలీసులు అక్కడికి భారీగా చేరుకున్నారు. ఘాయంత్రం 7 గంటలకు - పార్కు పూర్తిగా నిండిపోవడంతో ఎవరూ ఎటూ కదల్లేని పరిస్థితి నెలకొంది. ఘాత్రి 8:20 - పార్కు నుంచి టికెట్ల జారీ కౌంటర్లోకి అనుమతించడంతో భక్తుల మధ్య తోపులాట జరిగింది. ఒక్కసారిగా తోసుకుని రావడంతో ప్రాణ నష్టం జరిగింది. ఘాత్రి 8:40 - సంఘటన స్థలానికి చేరుకున్న అంబులెన్సులు.. తిరుపతి స్విమ్స్, రుయా ఆస్పత్రులకు క్షతగాత్రులను తరలించారు. ఎస్పీ సుబ్బారాయుడు సిబ్బందితో అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. తిరుపతి తొక్కిసలాట ఘటనతో తీవ్ర విషాదం నెలకొంది. బుధవారం రాత్రి ఎటుచూసినా బాధితుల ఆర్తనాదాలు, బాధితులకు పోలీసులు, స్థానిక భక్తులు సీపీఆర్ చేసిన దృశ్యాలే కనిపించాయి. వైకుంఠ ద్వార దర్శన టోకెన్ల కేంద్రాల వద్ద జరిగిన దుర్ఘటనలో ఆరుగురు మృతి చెందగా.. 48 మందికి గాయాలయ్యాయి. అయితే, ఘటనకు పోలీసుల, అధికార యంత్రాంగం నిర్లక్ష్యం కూడా కారణమని.. సరైన ఏర్పాట్లు చేయలేదని భక్తులు ఆరోపిస్తున్నారు. తిరుపతిలోని 8 కేంద్రాల వద్ద స్లాటెడ్ సర్వదర్శనం టోకెన్ల జారీకి అధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ నెల 10, 11, 12 తేదీలకు సంబంధించి మొత్తం 1.20 లక్షల టోకెన్లు జారీ చేయనున్నట్లు ప్రకటించారు. గురువారం ఉదయం 5 గంటలకు టోకెన్లు జారీ చేస్తామని తెలపగా.. బుధవారం ఉదయం నుంచే రాష్ట్రంతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో క్యూలైన్లలో వేచి ఉన్నారు. బుధవారం సాయంత్రానికి భక్తుల రద్దీ మరింత పెరిగింది. జీవకోన, బైరాగిపట్టెడ, శ్రీనివాసం, అలిపిరి ప్రాంతాల్లో తొక్కిసలాట జరిగింది. తొలుత జీవకోన వద్ద ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద

స్వల్ప తోపులాట జరగ్గా.. రాత్రి 7 గంటల సమయంలో భక్తులు క్యూలైన్లలోకి ప్రవేశించబోయారు. పోలీసులు అడ్డుకునేందుకు యత్నించినా ఒకరినొకరు తోసుకుంటూ లోపలికి వెళ్లే క్రమంలో తోపులాట జరిగింది. ఎస్పీ సుబ్బారాయుడు అక్కడికి వెళ్లి పరిస్థితి అదుపులోకి తెచ్చారు. ఇక్కడ పరిస్థితి అదుపులోకి వచ్చిందని భావిస్తుండగానే.. ఎక్కువ మంది భక్తులుండడంతో అధికారులు వారిని పక్కనే ఉన్న శ్రీ పద్మావతి పార్కులోకి అనుమతించారు. బుధవారం రాత్రి 8:15 గంటల సమయంలో పార్కులో ఉన్న ఓ వ్యక్తి అస్వస్థతకు గురి కావడంతో ఆయనకు వైద్యం అందించేందుకు అధికారులు గేట్లు తెరవబోయారు. అయితే, క్యూలైన్లలోకి వదిలేందుకే గేట్లు తెరుస్తున్నారని భావించిన కొందరు ఒక్కసారిగా దాన్ని బలంగా తోసుకుని ముందుకెళ్లే ప్రయత్నం చేశారు. దీంతో చాలామంది భక్తులు కింద పడిపోయారు. ఈ క్రమంలో ఊపిరాడక పలువురు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. పోలీసులు క్షతగాత్రులను అంబులెన్సులో రుయా, స్విమ్స్ ఆస్పత్రులకు తరలించారు. ఆస్పత్రికి వెళ్లే సమయానికే నలుగురు మృతి చెందినట్లు

వైద్యాధికారులు తెలిపారు. బైరాగిపట్టెడ వద్ద జరిగిన ఘటనలోనే ఆరుగురు చనిపోయారు. అటు, సమాచారం అందుకున్న వెంటనే టీటీడీ ఈవో శ్యామలరావు, జేఈవోలు వీరబ్రహ్మం, గౌతమి, ఎస్పీ సుబ్బారాయుడు, నగరపాలక సంస్థ కమిషనర్ మౌర్య ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు పర్యవేక్షించారు. గతంలో బారికేడ్లను ఏర్పాటు చేసి అక్కడ పరిస్థితిని అనుసరించి భక్తులను క్యూలైన్లలోకి అనుమతించేవారు. ఎన్నడూ లేని విధంగా బైరాగిపట్టెడ టోకెన్ల కేంద్రం వద్ద ఉన్న పార్కులోకి భక్తులను అనుమతించారు. బుధవారం మధ్యాహ్నం నుంచి అక్కడే కూర్చుని ఉండడంతో పలువురు అస్వస్థతకు గురయ్యారు. పార్కులో ఎక్కువ మంది ఉండడం.. వారంతా ఒక్కసారిగా వెలుపలికి వచ్చేందుకు గేటును తోయడంతో కిందపడిపోయారు. ఇదే తొక్కిసలాటకు దారి తీసిందని సమాచారం.

# ముక్తేశ్వర ఆలయ పాలకమండలికి 'రీ-నోటిఫికేషన్'






### ఈనెల 26 వరకు దరఖాస్తుల స్వీకరణ

### పూర్తి వివరాలకు దేవస్థానం సంప్రదించండి: ఈవో మారుతి

**క్రైమ్ మిర్రర్, మహాదేవ్ పూర్:** జయశంకర్ జిల్లా మహాదేవ్ పూర్ మండలంలోని కాళేశ్వరం ముక్తేశ్వర స్వామి దేవాలయ పాలకమండలి నియామకమానికి రాష్ట్ర దేవాదాయశాఖ ఉత్తర్వులు విడుదల చేసింది. ఆసక్తి గలవారు ఈ నెల 26 వరకు దరఖాస్తులు పెట్టుకోవచ్చని ఆలయ ఈవో మారుతి మీడియాకు తెలిపారు. దక్షిణ కాశీగా పేరుగాంచిన ఈ క్షేత్రంలో ప్రపంచంలోనే ఎక్కడా లేని విధంగా ఒకే పానవట్టంపై రెండు శివలింగాలు ఉంటాయి. కాలుడు, శివ్వుడు ఇద్దరూ లింగ రూపంలో ఒకే పానవట్టంపై దర్శనమిస్తారు. గర్భగుడికి నాలుగుదిక్కులా నాలుగు నంది విగ్రహాలు, నాలుగు ధ్వజస్తంభాలు, నాలుగు గోపురాలు ఉండటం కాళేశ్వర క్షేత్రం ప్రత్యేకత. గోదావరి, ప్రాణహిత నదుల పరివాహక ప్రాంతంలోని తెలంగాణ, మహారాష్ట్ర, చత్తీస్‌గడ్ రాష్ట్రాల భక్తుల పూజలతో కాళేశ్వర%-%ముక్తీశ్వర క్షేత్రం విరాజిల్లుతుంది. ఇంతటి ప్రాముఖ్యత కలిగిన కాలేశ్వర ముక్తీశ్వర ఆలయ పాలకమండలికి దరఖాస్తులు కూడా ఎక్కువగానే వచ్చే అవకాశాలు ఉన్నాయి.

## కత్రం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో క్రికెట్ పోటీలు

### యువతలక్రీడాస్ఫూర్తినినింపడం అభినందనీయం వేనేపల్లి చందర్ రావు



**కోదాడ జనవరి 09 క్రైమ్ మిర్రర్:** క్రీడాకారులను ప్రోత్సహిస్తూ యువతలో క్రీడాస్ఫూర్తిని నింపేందుకు కత్రం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నియోజకవర్గ స్థాయి క్రికెట్ పోటీలను నిర్వహించడం అభినందనీయమని కోదాడ మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్ రావు, పిసిసి డెలికేట్ చింతకుంట్ల లక్ష్మీనారాయణ రెడ్డి,గ్రంధాలయ చైర్మన్ వంగవీటి రామారావు,మున్సిపల్ చైర్మన్ సామినేని ప్రమీల లు అన్నారు. గురువారం కోదాడ పట్టణంలోని కటకమ్మ గూడెం బైపాస్ రోడ్డులో గల మైదానంలో కత్రం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కత్రం ప్రీమియర్ లీగ్ 3 పోటీలను డీఎస్పీ శ్రీధర్ రెడ్డి, ట్రస్ట్ అధ్యక్షులు కత్రం శ్రీకాంత్ రెడ్డి, తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి మాట్లాడారు. గత మూడు సంవత్సరాలుగా శ్రీకాంత్ రెడ్డి తన సొంత ఖర్చులతో కోదాడ నియోజకవర్గంలో క్రీడా రంగాన్ని ప్రోత్సహిస్తున్నందుకు గాను వారిని ప్రత్యేకంగా అభినందించారు. యువత విద్యతోపాటు క్రీడ రంగాల్లో రాణించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలోమున్సిపల్ వైస్ చైర్మన్ కందుల కోటేశ్వరరావు, కత్రం కిరణ్ కుమార్ రెడ్డి, ముడియాల సత్యనారాయణ రెడ్డి, వేనేపల్లి నరేష్ రావు, ముడియాల బాబి,మాజీ సర్పంచ్ పారా సీతయ్య, ఎర్నేని బాబు, పైడిమర్రి సత్తిబాబు, ఉమా శ్రీనివాసరెడ్డి, బాల్ రెడ్డి,ఓరుగంటి శ్రీనివాస్ రెడ్డి, దేగ శ్రీధర్, ముత్తవరపు రామారావు, ఈదుల కృష్ణయ్య, పట్టాభి రెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల అభివృద్దే లక్ష్యంగా పనిచేస్తా

### ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి



**కోదాడ, జనవరి 09(క్రైమ్ మిర్రర్):** నియోజకవర్గంలోని అన్ని గ్రామాల అభివృద్దే లక్ష్యంగా పనిచేస్తానని కోదాడ ఎమ్మెల్యే ఉత్తమ్ పద్మావతి తెలిపారు.గురువారం అనంతగిరి మండలంలో 1కోటి 51లక్షల రూపాయల నిధులతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు.అనంతగిరి మండలంలోని కొత్తగూడెం, గొండ్రియాల,పాలారం, వసంతాపురం గ్రామాలలో గ్రామ పంచాయతీ భవనాలకు మరియు కొత్తగూడెం, పాలారం,శాంతినగర్ గ్రామాలలో అంగన్వాడీ భవనాలకు శంకుస్థాపన చేసినారు.అలాగే పాలారం గ్రామంలో పాలారం నుండి కృష్ణాపురం వరకు,పాలారం నుండి వయా రంగయ్య గూడెం మీదుగా క్యాడ్ రోడ్డు వరకు బిటి రోడ్డుకు శంకుస్థాపన చేసినారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని గ్రామాలలో కనీస సౌకర్యాలు, మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. ప్రజల సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్నా మని ఎలాంటి సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకురావాలని ఎమ్మెల్యే ప్రజలకు విజ్ఞప్తి చేసినారు. అభివృద్ధి పనులు త్వరగా తిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఇట్టి కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## పోలీసు పనితీరును ప్రజలు ఆన్లైన్ నందు తెలుపవచ్చు

**కోదాడ జనవరి 9 క్రైమ్ మిర్రర్ :** పోలీసు అందిస్తున్న సేవల పై ప్రజలు వారి అభిప్రాయం తెలియజేయడానికి రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర పోలీసు శాఖ క్యూఆర్ కోడ్ ను అందుబాటులోకి తెచ్చినది అని జిల్లా ఎస్పీ సన్ ప్రీత్ సింగ్ ఐపిఎస్ అన్నారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయం నందు క్యూఆర్ కోడ్ పోస్టర్ అను అదనపు ఎస్పీ నాగేశ్వర రావు,డిసిఆర్బి డీఎస్పీ మట్టయ్య లతో కలిసి అవిష్కరించారు. ఈ క్యూఆర్ ఇంటర్నెట్ మద్యమాల ద్వారా స్కాన్ చేసి వివరాలు నమోదు చేయవచ్చు అని తెలిపినారు. సిటిజన్ ఫీడ్బ్యాక్ ను తెలియజేయడానికి రాష్ట్ర వ్యాప్తంగా ఈరోజు సిటిజన్ ఫీడ్బ్యాక్ క్యూఆర్ కోడ్ ను ప్రారంభించడం జరిగింది. గతంలో పోలీసుల సేవలపై పిర్యాదుదారుల కు ఫోన్ చేసి అభిప్రాయాలు సేకరించేవారు. ప్రస్తుతం ఈ క్యూఅర్ కోడ్ ము స్కాన్ చేసి పిటిషన్, ఎఫ్ఐఆర్, ఈ చలాన్, పాస్పోర్ట్ ధ్రువీకరణ మరియు ఇతర అంశాలపై, పోలీసు అధికారుల ప్రతిస్పందన మరియు ప్రవర్తన వారి అభిప్రాయాలను నమోదు చేయవచ్చును. పోలీస్ స్టేషన్లో మరియు అధికారులు సేకరించిన అభిప్రాయాల ఆధారంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పోలీస్ స్టేషన్లో రేటింగ్ చేయబడతారని తెలియజేశారు. ఈ విధానం పోలీసు సిబ్బందిలో బాధ్యత పారదర్శకతను పెంచుతుందని అన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్ ప్రతి పోలీసు కార్యాలయం నందు ఈ క్యూఆర్ కోడ్ను ప్రజలకు అందుబాటులో ఉండేదా ప్రదర్శిస్తామన్నారు. ఈ క్యూఆర్ కోడ్ ప్రతి ఒక్క పోలీస్ స్టేషన్ లలో ప్రజలకు సులభంగా కనిపించే విధంగా రిసెప్షన్ సెంటర్, స్టేషన్ హౌస్ అధికారి రూమ్ నందు, ప్రజలు వేచి ఉండే గది నందు, బయటి ప్రవేశ ద్వారం వద్ద అందుబాటులో ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమం నందు అదనపు ఎస్పీ నాగేశ్వరరావు,డిసిఆర్బి డీఎస్పీ మట్టయ్య, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ నాగభూషణం, సెక్షన్ సూపరింటెండెంట్ శ్రీకాంత్, ఐటీ కోడ్ ఆర్ ఎస్ ఐ రాజశేఖర్ సిబ్బంది ఉన్నారు.

## ఉపముఖ్యమంత్రి ని సన్మానించిన తిరుమలమహేష్



**వనపర్తి (క్రైమ్ మిర్రర్ ప్రతినిధి):** వనపర్తి నియోజవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు చేయడానికి వచ్చిన తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క నీ కాంగ్రెస్ సీనియర్ నాయకులు ప్రముఖ వ్యాపారవేత్త తిరుమల బిల్డర్స్ అధినేత తిరుమల మహేష్ వనపర్తి ఎమ్మెల్యే తుడి మెగా రెడ్డి ఆధ్వర్యంలో క్యాంపు కార్యాలయం దగ్గర ఉప ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి బుకే ఇచ్చి శాలువాతో సన్మానించారు ఉపముఖ్యమంత్రి తో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వనపర్తి ఎమ్మెల్యే తూడి మెగా రెడ్డి రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి ఆధ్వర్యంలో వనపర్తి నియోజకవర్గం దినదినాభివృద్ధి చెందింది అని రానున్న కాలంలో ఇంకా ఎక్కువ అభివృద్ధి చెందాలని చెప్పాను అని తెలిపారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు..







## దొంగతనాలపై కట్టడి

### నిందితుల వివరాలు వెల్లడించిన పోలీసులు

**క్రైమ్ మిర్రర్, మిర్యాలగూడ:** మిర్యాలగూడ పోలీసులు గురువారం ఒక కీలక ప్రకటన చేశారు. పట్టణంలో దొంగతనాలకు పాల్పడుతున్న నిందితుల వివరాలను విడుదల చేస్తూ, వారి ఫోటోలు కలిగిన పోస్టర్లు ప్రజలకు చూపించారు. ఈ నిందితులు ప్రస్తుతం తప్పించుకుని తిరుగుతున్నారని, వీరిని గుర్తించిన వారు వెంటనే పోలీసులకు సమాచారం అందించాల్సిందిగా వారు విజ్ఞప్తి చేశారు.పోలీసులు ఇచ్చిన సమాచారం ప్రకారం, ఈ నిందితులు మిర్యాలగూడ పట్టణంతో పాటు సమీప ప్రాంతాల్లో చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. వారిని పట్టుకునేందుకు ప్రజల సహకారం అవసరమని, సమాచారం అందించిన వారికి తగిన పారితోషికం అందజేస్తామని హామీ ఇచ్చారు.సమాచారం అందించినవారి వివరాలను గోప్యంగా ఉంచుతామని భరోసా ఇస్తూ, సమాజంలో శాంతి, భద్రతలను కాపాడటానికి ప్రజల సహకారం అవసరమని పోలీసులు అన్నారు. "సమాజం పట్ల మీ బాధ్యతను చాటుకుందాం, నేరస్థులను పట్టుకునేందుకు ముందుకు రావాలి" అని వారు విజ్ఞప్తి చేశారు.అయితే, ఈ కేసుల్లో నిందితులపై మరిన్ని వివరాలు తెలియజేయలేదు. పోలీసులు ఈ ప్రకటన ద్వారా ప్రజల నేర నియంత్రణలో భాగస్వామ్యం కోరుతూ సజాగ్రత్తగా ఉండాలని సూచించారు.

## క్యూఆర్ కోడ్ ద్వారా అభిప్రాయాలు తెలపాలి...!

### నవాబ్ పేట్ ఎస్సై కే. అరుణ్ కుమార్..!




**క్రైమ్ మిర్రర్ వికారాబాద్ జిల్లా ప్రతినిధి:** పోలీస్ సేవలపైన మండల ప్రజల అభిప్రాయాన్ని క్యూఆర్ కోడ్ ద్వారా తెలపాలని నవాబ్ పేట్ ఎస్సై కే. అరుణ్ కుమార్ కోరారు.వికారాబాద్ జిల్లా నవాబ్ పేట్ మండలంలో పోలీసులు అందిస్తున్న సేవలపైన ప్రజల అభిప్రాయం తెలుపేందుకు నవాబ్ పేట్ పోలీస్ స్టేషన్ లో సిటిజెన్ ఫీడ్ బ్యాక్ క్యూఆర్ కోడ్ కలిగిన పోస్టర్ ను నవాబ్ పేట్ ఎస్సై అరుణ్ కుమార్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. పోలీసుల సేవలు, వారి పని తీరుపై స్టేషన్ లో ఫిర్యాదు తీసుకునేందుకు,ఎఫ్ఐఆర్ నమోదు చేసేందుకు, ఈ చాలన్,ఇతర అంశాల పైన ప్రజల అభిప్రాయాన్ని ఇక నుంచి క్యూఆర్ కోడ్ ద్వారా తెలిపాలని అన్నారు. పోలీస్ స్టేషన్లలో ఈ సౌకర్యం ఉంటుందని,పోస్టర్లు అందుబాటులో ఉంటాయని చెప్పారు.క్యూఆర్ కోడ్ స్కాన్ చేస్తే వచ్చే లింక్ ఓపెన్ చేసి అభిప్రాయాలు తెలపాలని సూచించారు.



## విలేకరులు వార్తలు సేకరించి ప్రజలకు తెలియజేయడంలో వారి కృషి ప్రశంసనీయం :చందర్ రావు

**కోదాడ జనవరి 09 క్రైమ్ మిర్రర్ :** కోదాడ:సమాజంలో జరుగుతున్న చెడును, మంచిని ఎప్పటికప్పుడు వార్తలు సేకరించి పత్రికల ద్వారా ప్రజలకు తెలియజేయడంలో వారి కృషి ప్రశంసనీయమని కోదాడ మాజీ శాసనసభ్యులు వేనేపల్లిచందర్రావు టిపిసిసి డెలిగేట్ చింతకుంట్ల లక్ష్మీనారాయణ రెడ్డి, కోదాడ డి.ఎస్.పి శ్రీధర్ రెడ్డి, జిల్లా గ్రంధాలయ చైర్మన్ వంగవీటి రామారావు. మున్సిపల్ చైర్పర్సన్ సామినేని ప్రమీల రమేష్ అన్నారు గురువారం పట్టణములోని నిజం చెప్తాం కోదాడ ఇన్చార్జి శివనాగు ఆధ్వర్యంలో నూతన క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమానికి వారు ముఖ్య అతిథులుగా పాల్గొని నూతన క్యాలెండర్లు ఆవిష్కరించారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎర్నేని బాబు, పాలసీతయ్య,ఉమా శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ కందుల కోటేశ్వరరావు యూత్ నాయకులు దేగ శ్రీధర్ ముత్తారపు రామారావు, డాక్టర్ బ్రహ్మం ,ఈదుల కృష్ణయ్య, సీతారాం రెడ్డి, దావుల తదితరులు పాల్గొన్నారు

## జాతీయ రోడ్డు భద్రత మహోత్సవాల కార్యక్రమంలో పాల్గొన్న

# సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద లాల్

**వాహనదారులు విధిగా హెల్మెట్, సీట్ బెల్టు ధరించాలి**



**కోదాడ జనవరి 9 క్రైమ్ మిర్రర్ :** ప్రమాదాల బారిన పడకుండా ఎంతో విలువైన ప్రాణాలను కాపాడుకునేందుకు వాహనాలు నడిపే సమయంలో ప్రతి ఒక్కరు విధిగా హెల్మెట్, సీట్ బెల్టు ధరించాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవర్ సూచించారు.నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యం కారణంగా రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకుని ఎంతోమంది నిండు ప్రాణాలను కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకుని జిల్లా పోలీస్,రవాణా శాఖల ఆధ్వర్యంలో గురువారం జిల్లా కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. శిరస్త్రాణం ధరించాల్సిన ఆవశ్యకతపై ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు చేపట్టిన ఈ ర్యాలీని గవర్నమెంట్ మెడికల్ కళాశాల కూడలి ఎన్టీఆర్ పార్క్ దగ్గర బైక్ ర్యాలీను కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడపడం వల్ల ప్రమాదాలు జరిగిన సమయాలలో విలువైన నిండు ప్రాణాలను కోల్పోతున్నారని అన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని అన్నారు.ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా అతివేగంగా వాహనాలు నడపడం, హెల్మెట్, సీట్ బెల్ట్ ధరించకపోవడం వంటివి రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణం అవుతున్నాయని అన్నారు. ప్రమాదాలకు గురై మృత్యువాత పడుతున్న వారు నిండు ప్రాణాలను కోల్పోతుండగా, వారి కుటుంబాలకు కూడా తీరని నష్టం కలిగిస్తున్నారని అన్నారు. ప్రతి ఒక్కరు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, చిన్నచిన్న సరదాలకు పోయి నిర్లక్ష్యంతో వాహనాలు నడిపి ప్రమాదాల బారిన పడి తల్లిదండ్రులకు తీరని శోకం మిగిల్చవద్దని హితవు పలికారు.రోడ్డు దుర్ఘటనలలో అత్యధికంగా ద్విచక్రవాహనదారులు ప్రమాదాలకు గురవుతూ ప్రాణాలు కోల్పోతున్నారని, ఎంతోమంది క్షతగాత్రులు గా మారుతున్నారని అన్నారు. హెల్మెట్ ధరించి వాహనాలు నడిపితే దాదాపు 90 శాతం వరకు ప్రాణాపాయం బారి నుండి తమను తాము కాపాడుకునేందుకు ఆస్కారం ఉంటుందని సూచించారు. ప్రతిఒక్కరు హెల్మెట్ ధరించడాన్ని అలవాటుగా చేసుకోవాలని, దీనిని కనీస బాధ్యతగా భావించాలని పిలుపునిచ్చారు. ఎదుటివారి వల్ల ప్రమాదాలకు గురైన సందర్భాలలోనూ హెల్మెట్ ప్రాణాపాయ స్థితి నుండి కాపాడుతుందని గుర్తు చేశారు. ప్రమాదాల నియంత్రణ కోసం వాహనాల తనిఖీలు నిర్వహిస్తూ, నిబధనల మేరకు జరిమానాలు విధించడం వంటివి చేస్తున్నప్పటికీ, ఎవరికివారు ట్రాఫిక్ నిబంధనలను విధిగా పాటించినప్పుడే ప్రమాదాలకు కళ్లెం వేయవచ్చని సూచించారు. హెల్మెట్ల వినియోగం అత్యావశ్యకం, సురక్షితం అనే విషయాన్ని ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించేందుకు విస్తృత స్థాయిలో కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్రమాదాలను నిలువరించేందుకు ప్రతిఒక్కరు బాధ్యతాయుతంగా వాహనాలు నడుపుతూ, తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని హితవు పలికారు. ఈ సందర్భంగా హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనదారులకు శిరస్త్రాణం ధరించాల్సిన అవశ్యకతను తెలియజేస్తూ, సూర్యాపేట టూవిలర్స్ అసోసియేషన్ వారు అందజేసిన హెల్మెట్ లు కలెక్టర్ అందజేశారు. హెల్మెట్ ధరించి ప్రయాణిస్తున్న వారిని అభినందించారు. అనంతరం ర్యాలీ ప్రాధాన వీధులగుండా ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోదాడ DSP M. శ్రీధర్ రెడ్డి గారు, కోదాడ టౌన్ CI T. రాము, కోదాడ రూరల్ CI A. రజితా రెడ్డి, మోటార్ వెహికిల్ ఇన్స్పెక్టర్ Sk. జిలానీ, కోదాద్ టౌన్ SIs A. రంజిత్ రెడ్డి, Sk. సైదులు, ట్రాఫిక్ SI V%. మల్లేష్, రూరల్ SI M. అనిల్ కుమార్ రెడ్డి, చిలుకూరు SI S. రాంబాబు అడిషనల్ ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

## మాజీ మంత్రి కేటీఆర్ పై కేసు కుట్రపూరితం..!

**బీఆర్ఎస్ నవాబ్ పేట్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ శాంతకుమార్...!**



**క్రైమ్ మిర్రర్ వికారాబాద్ జిల్లా ప్రతినిధి:** ఫార్ములా ఈ రేస్ ఒక బేఖారు కేసు అని,కేటీఆర్ ను ప్రజాక్షేత్రంలో ఎదుర్కొలేక అవినీతి అంటూ ఇది కాంగ్రెస్ లేపిన పుకారు అని బీఆర్ఎస్ నవాబ్ పేట్ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ శాంతకుమార్ మండిపడ్డారు.గురువారం ఆయన ఓ ప్రకటనలో మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌పై కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రపూరితంగానే కేసు పెట్టిందని, గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయలేక డైవర్షన్ పాలిటిక్స్ చేస్తుందని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వంపై వెల్లువెత్తిన ఆగ్రహాన్ని పక్కదారి పట్టించడానికే కేటీఆర్‌పై అక్రమ కేసులు పెట్టారని ధ్వజమెత్తారు.ఈడీ, ఏసీబీలు పోటీ పడి కేసులు పెడుతున్నారని, ఉద్యమ శిఖరం కేసులకు భయపడే వ్యక్తి కాదని స్పష్టం చేశారు.కేటీఆర్ పై నమోదు చేసిన అక్రమ కేసును వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేస్తున్నానని తెలిపారు.

## ఫాతిమా షేఖ్ జయంతి



**చిట్యాల, జనవరి 09(క్రైమ్ మిర్రర్):** నల్లగొండ జిల్లా చిట్యాల మున్సిపాలిటీ పట్టణ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకులు సయ్యద్ ఇమ్రాన్ ఆధ్వర్యంలో భారతదేశ మొట్ట మొదటి ముస్లిం మహిళా ఉపాధ్యాయురాలు, సావిత్రి బాయ్ పూలే సహచరురాలు ఫాతిమా షేఖ్ జయంతి సందర్భంగా చిట్యాల పట్టణం లోని ఉర్దూ మీడియం పాఠశాలలో వారి చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించి ఈ సందర్భంగా పాఠశాలలో పిల్లలకు పండ్లు పంపిణీ చేయడం జరిగింది... ఈ కార్యక్రమంలో సలాం, అజార్, మోబిన్, హైమద్, రజాక్, ఆసిఫ్, యాకూబ్ తదితరులు మైనార్టీ నాయకులు పాల్గొనడం జరిగింది

మునుగోడులో దొంగల బీభత్సం,తాళాలు వేసి వున్న ఇండ్లు టార్గెట్

## క్లూజ్ టిమ్,డాగ్ స్క్వాడ్ తనిఖీ

**బంగారం,వెండి,నగదు ,బైక్ చోరీ**

**హడలెత్తించిన దొంగలు.. ఫారెస్ట్ ఆఫీసులో సైతం**

**డీఎస్పీ ఆధ్వర్యములో ప్రత్యేక బృందం**






**మునుగోడు క్రైమ్ మిర్రర్ :** మునుగోడు మండల కేంద్రంలో బుధవారం రాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. తాళాలు వేసి ఉన్న ఇండ్లు పక్కా ప్లాన్ తో సీసీ కెమెరాలకు చిక్కకుండా దొంగతనానికి పాల్పడ్డారు..మండల కేంద్రములో నాగార్జున స్విట్ హౌజ్ యజమాని లింగస్వామి ఇంట్లో 70 వేళ రూపాయలు నగదు,12 తులాల బంగారం, బట్టల షాపు యజమాని వెనిగల పురుషోత్తం ఇంట్లో 60 వేళ నగదు,అరకిలో వెండి,మరియు రాసమల్ల శ్రీరాములు ఇంట్లో బైక్ తోపాటు రావిగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని వడ్డెరగూడెంలో ముద్దమల్ల నర్సింహ ఇంట్లో రెండు లక్షల 50 వేల రూపాయల నగదు దొంగిలించినట్లు సమాచారం.ఫారెస్ట్ కార్యాలయంలో సైతం గాలించారు.బాధితులు ఇచ్చిన పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి ఘటన స్థలాన్ని , క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ మరియు ఫింగర్ ప్రింట్ బృందాన్ని పిలిపించి పరిశీలించారు.నల్లగొండ డీఎస్పీ శివరామ్ రెడ్డి ఆధ్వర్యములో పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి నేరస్తుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు..అనుమాన స్పద వ్యక్తులు కనపడితే ప్రజలు పోలీసులకు వెంటనే సమాచారం అందించాలన్నారు..



# మాజీమంత్రి సబితా ఇంద్రారెడ్డి అత్యుత్సాహం : దేప భాస్కర్ రెడ్డి

**ప్రోటోకాల్,అధికార యంత్రాంగానికి సమాచారం లేకుండా ప్రారంభోత్సవం**

**ఇన్ఛార్జి మంత్రి శ్రీధర్ బాబు వచ్చే కార్యక్రమంపై ఒంటెద్దు పోకడ**

**సబితా ఇంద్రారెడ్డి తీరుపై మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ శ్రేణుల ఆగ్రహం**



**మహేశ్వరం ప్రతినిధి(క్రైమ్ మిర్రర్):** మాజీమంత్రి సబితా ఇంద్రారెడ్డికి ఎప్పుడూ అధికార దాహం తప్పా... ఓ సిద్ధాంతం, ప్రోటోకాల్ తెలియదని కాంగ్రెస్ సీనియర్ నాయకులు దేప భాస్కర్ రెడ్డి విమర్శించారు. గురువారం మహేశ్వరం నియోజకవర్గం మండలం నాగారం పడమటి తండాలో గ్రామపంచాయతీ భవనం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే సబిత ఇంద్రారెడ్డి అత్యుత్సాహం ప్రదర్శించారని ఆగ్రహం వ్యక్తం చేశారు.కనీసం గ్రామపెద్దలకు, పంచాయతీరాజ్, ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వకుండా హడావుడిగా ప్రారంభోత్సవం చేశారని దేప భాస్కర్ రెడ్డి మండిపడ్డారు. రంగారెడ్డి జిల్లా ఇన్ఛార్జి మంత్రి శ్రీధర్ బాబు ప్రారంభోత్సవానికి వస్తానని చెప్పినా పెడచెవిన పెట్టి అధికారులకు సమాచారం ఇవ్వకుండా కేవలం బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలతో కలిసి గ్రామపంచాయతీ బిల్డింగ్ ప్రారంభించారని కాంగ్రెస్ నేతలు విమర్శించారు.5 సార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసిన సబితాకు రాజ్యాంగాన్ని, అధికార యంత్రాంగాన్ని గౌరవించాలన్న సోయి లేకుండా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. కేవలం కలెక్టర్ కు అరగంట ముందు చెప్పి ఎలా ప్రారంభోత్సవం చేస్తారని ఆగ్రహం వ్యక్తం చేశారు మహేశ్వరం మండల నాయకులు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక గ్రామపంచాయతీలు, నిధులు కేటాయిస్తున్నట్లు చెప్పారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కనీసం పంచాయతీలకు నిధులు, జీతాలు ఇవ్వలేని దుస్థితిలో ఉన్నట్లు దేప భాస్కర్ రెడ్డి గుర్తుచేశారు. మాజీమంత్రి సబితకు శిలాఫలకాలపై ఉన్న ధ్యాస అభివృద్ధి, ప్రోటోకాల్ పై ఉండదని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు.ఈ కార్యక్రమంలో మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్, యూత్ కాంగ్రెస్ నాయకులు భారీ సంఖ్యలో పాల్గొని సబితకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి రాకముందే గ్రామస్థులు,కాంగ్రెస్ నేతలు కలిసి కొబ్బరికాయలు కొట్టి బిల్డింగ్ ప్రారంభించారు. మరోసారి మాజీమంత్రి సబితా ప్రోటోకాల్ పాటించకుండా అధికారులకు సమాచారం ఇవ్వకుండా ప్రభుత్వ కార్యక్రమాలు చేస్తే అడ్డుకుంటామని కాంగ్రెస్ శ్రేణులు హెచ్చరించాయి.

# నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని ప్రారంభించి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

**రాష్టాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తిసుకెళ్లినది బి ఆర్ ఎస్ ప్రభుత్వం**

**అబద్దాల మాటలతో ప్రజలను మోసం చేస్తు కాలం గడుపుతున్నది కాంగ్రెస్ ప్రభుత్వం**

**కాంగ్రెస్ ప్రభుత్వం పై నిప్పులు చెరిగిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి**




**మహేశ్వరం ప్రతినిధి(క్రైమ్ మిర్రర్ ):** మహేశ్వరం మండలంలోని పడమటి తాండ గ్రామంలో నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని మాజీ సర్పంచ్ సభావత్ అనితా రవి నాయక్ లింగ్యా నాయక్ లతో కలిసి ప్రారంభించి గ్రామ ప్రజలకు అంకితం చేసిన మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గము శాసనసభ్యురాలు సబితా ఇంద్రారెడ్డి. ఈ సందర్బంగా సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ... గతంలో కొన్ని సంవత్సరాలు గిరిజన సోదరులు తాండలను గ్రామ పంచాయతీలుగా చెయ్యలని చేసిన పోరాటాన్ని దృష్టిలో పెట్టుకొని కేసీఆర్ రాగానే తాండలను గ్రామ పంచాయతీలుగా చేసి వారి పాలన వారే నిర్వహించుకునేటట్లు చేసిన ఘనత కేసీఆర్ దేనని గుర్తుచేశారు.అందులో భాగంగానే నాగరం గ్రామ పంచాయతీలో ఉన్న పడమటి తాండను గ్రామ పంచాయితీగా ఏర్పాటు చేయడం జరిగింది. తద్వారా గ్రామపంచాయతీకి కేటాయించిన నిధులతో తాండ రూపురేఖలు మారి పోయాయని,గత ప్రభుత్వంలోనే గ్రామ పంచాయతీలు అభివృద్ధి పథంలో నడిచాయని.ఈ ప్రభుత్వం ఒక్క రూపాయి కూడా ఏ ఒక్క గ్రామ పంచాయతీకి ఇవ్వలేకపోయిందని అన్నారు.తప్పనిసరి లోకల్ ఎలక్షన్స్ చెయ్యాల్సి వచ్చిన పరిస్తితి ఏర్పడిందని. కాంగ్రెస్ పార్టీ గెలిచే అవకాశం లేనందున ఓటర్లను ప్రసన్నం చేసుకునే ఉద్దేశంతో మళ్ళీ రైతుబంధు (రైతుబరోసా) ఇస్తామని మాయమాటలు చెప్తున్నారు.ఒకవేళ ఇచ్చిన ఎలక్షన్ కోసం ఒక్కసారే ఇస్తారని అన్నారు.సంపూర్ణ రుణమాఫీ చెయ్యనేలేదు,రెండు సార్లు రైతుబంధు ఎగ్గొట్టారు.15 వేలు ఇస్తామన్న రైతుబరోసా 12 వేలకు కుదించారని అని ఈ ప్రభుత్వం ఎగ్గొట్టే ప్రభుత్వం అని ఎద్దేవా చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఎం చేశారో చెప్పలేక చెప్పడానికి ఏమి చెయ్యలేదు వారి లోపాలను కప్పిపుచ్చుకునేందుకే గతప్రభుత్వం ఎం చేసిందని ఎదురు దాడి చేస్తూ కల్లబొల్లి మాటలు చెప్తున్నారని.గతంలో మీ మాయమాటలని నమ్మిన ప్రజలు ఇప్పుడు నమ్మేపరిస్థితిలో లేరని మీకు రాబోయే రోజుల్లో తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు,బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు, వివిధ పార్టీలకు చెందిన నాయకులు, ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ నిర్మాణం కూల్చివేత

**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్):** బడంగ్పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నాదర్గుల్లో ఎటువంటి అనుమతులు లేకుండా 11వందల చదరపు గజాలలో నిర్మించిన షెడ్డును బడగ్పేట్ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ అధికారి లాలప్ప పర్యవేక్షణలో కూల్చి వేయడం జరిగింది. మున్సిపాలిటీ చట్టం 2019 ప్రకారం కార్పొరేషన్ పరిధిలో ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మాణాలు చేపట్టిన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని కావున నగర ప్రజలందరూ మున్సిపాలిటీ అనుమతి తీసుకొని అధికారులు చూపించిన సూచనల ప్రకారం నిర్మాణాలు చేపట్టాలని బడంగ్పేట్ కార్పొరేషన్ కమిషనర్ సరస్వతి తెలపడం జరిగింది.



# బీజేపీ సంస్థాన్ నారాయణపూర్ మండల అధ్యక్షుడిగా రెండోసారి ఎన్నికైన సుర్వి రాజుగౌడ్



**సంస్థాన్ నారాయణపూర్, జనవరి 09(క్రైమ్ మిర్రర్):** భారతీయ జనతా పార్టీ సంస్థాగత ఎన్నికలలో భాగంగా క్రియాశీల సభ్యులు, బూత్ అధ్యక్షులందరి అభిప్రాయాలు స్వీకరించి సంస్థాన్ నారాయణపూర్ మండల అధ్యక్షునిగా అల్లందేవిచెర్వు గ్రామానికి చెందిన సుర్వి రాజుగౌడ్ ,జిల్లా కౌన్సిల్ సభ్యునిగా చిమిర్యాల గ్రామానికి చెందిన దాసోజు వెంకటాచారి లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ నియామకాలు తక్షణమే అమల్లోకి వస్తాయనీ రాష్ట్ర అధికార ప్రతినిధి నల్గొండ జిల్లా ఎన్నికల ఇన్చార్జ్ కట్టా సుధాకర్ రెడ్డి తెలియజేశారు ఈ సందర్భంగా సుర్వి రాజుగౌడ్ మాట్లాడుతూ తన ఎన్నికకు సంహరించిన బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ గంగిడి మనోహర్ రెడ్డి ,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దోనూరు వీరారెడ్డి ,నల్గొండ జిల్లా అధ్యక్షులు నాగం వర్షిత్ రెడ్డి ,మునుగోడు అసెంబ్లీ కన్వీనర్ దూడల బిక్షంగౌడ్ ,జిల్లా ఉపాధ్యక్షులు బచ్చనబోయిన దేవేందర్ యాదవ్ ,ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి జక్కలి రాజు యాదవ్,జిల్లా నాయకులు భాస్కర నర్సింహా,వంగరి రఘు,జక్కర్తి బిక్షం,సంగిశెట్టి లక్ష్మీనారాయణ , నందగిరి జగత్ కుమార్ గౌడ్, వివిధ మోర్చాల నాయకులకు,పార్టీ సీనియర్ నాయకులకు,మండల అధ్యక్షుని ఎన్నికలలో భాగంగా జరిగినటువంటి అభిప్రాయ సేకరణలో తనకు మద్దతుగా నిలిచి అఖండ మెజారిటీనిచ్చిన పార్టీ క్రియాశీల సభ్యులకు,బూత్ అధ్యక్షులకు, కార్యకర్తలందరికి పేరు పేరునా ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తూ సంస్థాన్ నారాయణపూర్ మండలం లోని 31 గ్రామాలలోని కార్యకర్తలందరిని కలుపుకొని వారి సహకారంతో పార్టీని మరింత బలోపేతం చేస్తానని,రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో పార్టీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పని చేస్తానని అన్నారు.



## శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపిన కొలన్ హనుమంత్ రెడ్డి...

**కుత్బుల్లాపూర్, జనవరి 09 (క్రైమ్ మిర్రర్) :** కుత్బుల్లాపూర్ నియోజక వర్గం 126 డివిజన్ జగద్గిరిగుట్ట శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరా స్వామి ఆలయ కమిటీ ప్రమాణ స్వీకరణ కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ నియోజక కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం ఆలయ కమిటీ చైర్మన్ నరేందర్ రెడ్డి, డైరెక్టర్ గా శ్రీనివాస్ చారీ, బుచ్చి రెడ్డి, రవీందర్, రాజు, వేణు గౌడ్ నియమితులైన సందర్భంగా శాల్వాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు గణేష్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు లక్ష్మ రెడ్డి, క్రిష్ణ గౌడ్, రషీద్, మరియు మహిళ కాంగ్రెస్ నాయకురాలు, యువజన కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వైకుంఠ ఏకాదశి ముస్తాబైన శ్రీ లక్ష్మి నరసింహా స్వామి దేవాలయం



**సంస్థాన్ నారాయణపూర్, జనవరి 09(క్రైమ్ మిర్రర్):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపూర్ మండల రాచకొండ పరిధిలో వైకుంఠ ఏకాదశి సందర్బంగా శ్రీ లక్ష్మి నర్సింహా స్వామి దేవాలయం అంగరంగ వైభవంగా ముస్తబువుతున్న దేవాలయం ప్రాంగణం శుక్రవారం వైకుంఠ ఏకాదశి పుణ్యకాలంలో శ్రీ లక్ష్మి నర్సింహా స్వామి వారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలుస్వీకరించి స్వామివారి కృపకు పాత్రులు కాగలరు అని శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవాలయం, రాచప్ప సమితి సభ్యులు కోరారు.

## సంక్రాంతి ముగ్గుల పోటీలను వీక్షించిన జనసేన పార్టీ కంటెస్టెడ్ ఎమ్మెల్యే ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్...



**కూకట్ పల్లి, జనవరి 09 (క్రైమ్ మిర్రర్) :** కూకట్ పల్లి నియోజకవర్గం కెపిహెచ్బి కాలనీ 4వ ఫేస్ సిద్ధి వినాయక దేవాలయ ప్రాంగణంలో జరిగిన సంక్రాంతి ముగ్గుల పోటీల కార్యక్రమమునకు ఝాన్సీ రాణి, లక్ష్మీబాయ్ అసోసియేషన్ సభ్యులు ఎమ్ .వరలక్ష్మి, ఎన్ సులక్షణ, కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు కూకట్ పల్లి నియోజకవర్గం కంటెస్టెడ్ ఎమ్మెల్యే ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్, 114 డివిజన్ బిజెపి కంటెస్టెడ్ కార్పొరేట్ ప్రియతం రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని ముత్యాల ముగ్గులను వీక్షించారు. ఈ సందర్భంగా ప్రేమ కుమార్ మాట్లాడుతూ తెలుగు వారి సంస్కృతి, సాంప్రదాయాలైన ముగ్గుల పోటీలను నిర్వహించి మహిళలను, భావితరాల బాలికలను ప్రోత్సహిస్తు బహుమతులను అందజేస్తున్న కమిటీ సభ్యులు అందరిని అభినందించారు. ఈ కార్యక్రమంలో కూకట్ పల్లి జనసేన పార్టీ నాయకులు కొల్లా శంకర్, కలిగినిడి ప్రసాద్, అడబాల షణ్ముఖ, పోలబోయిన శ్రీనివాస్, పాదం సూర్య, పులగం సుబ్బు తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధి నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి...

### నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డు ను పరిశీలించిన కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్...



**కూకట్ పల్లి, జనవరి 09 (క్రైమ్ మిర్రర్) :** శేర్లింగంపల్లి నియోజకవర్గం, ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని ఉషముళ్ళపూడి ప్రధాన రహదారిలోని గోవింద్ హెూటల్ చౌరస్తా నుండి ఎల్లమ్మ చెరువు వరకు నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డు ను డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ గోవింద్ హెూటల్ చౌరస్తా నుండి ఎల్లమ్మ చెరువు వరకు జరుగుతున్న వరద నీటి పైప్ లైన్ పనులు, సీసీ రోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యాయి అన్నారు. ఈ రోజు నుండి సీసీ రోడ్డును వినియోగంలోకి తీసుకువస్తామని తెలియచేసారు. కార్యక్రమంలో భాస్కర్, యాదగిరి, సంగమేష్, అగ్రవాసు, వర్క్ ఇన్స్పెక్టర్ మహాదేవ్, కాంట్రాక్టర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా కంటెస్టెంట్ కార్పొరేటర్ పత్తి కుమార్ జన్మదినోత్సవం...

### శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నేతలు...

**బాలానగర్, జనవరి 09 (క్రైమ్ మిర్రర్) :** మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ చైర్మన్ కాప్రా డివిజన్ కంటెస్టెంట్ కార్పొరేటర్ పత్తి కుమార్ జన్మదినోత్సవం సందర్భంగా వారిని కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కూకట్పల్లి అసెంబ్లీ నియోజక వర్గం ఎస్సీ డిపార్ట్మెంట్ ఏ బ్లాక్ అధ్యక్షులు బందీగా బాల నరసింహ, ఉపాధ్యక్షులు జల్లా శివ, మేడ్చల్ జిల్లా యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి చిట్టాకోరు కృష్ణ, బాలానగర్ డివిజన్ వైస్ ప్రెసిడెంట్ మాధరి శ్రీనివాస్, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు రావుఫ్, చంద్రశేఖర్ (చింటూ) తదితరులు పాల్గొన్నారు.



## మున్నూరు కాపులకు మంత్రివర్గంలో చోటు కల్పించాలి

### మున్నూరు కాపు రాష్ట్ర అధ్యక్షులు వనమాల డిమాండ్



**క్రైమ్ మిర్రర్, హైదరాబాద్ :** మున్నూరు కాపు సంఘం తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు తన స్వగృహమునందు మీడియాతో మాట్లాడుతూ మున్నూరు కాపులకు మంత్రివర్గంలో చోటు కల్పించి మున్నూరు కాపులకు కార్పొరేషన్ నిధులు చైర్మన్, మెంబర్లను ప్రకటించి అన్ని విధాల కాంగ్రెస్ ప్రభుత్వం వారి డిమాండ్లను నెరవేర్చాలని అన్నారు. త్వరలో తెలంగాణ తెలంగాణ కాంగ్రెస్ గవర్నమెంట్ చేపట్టబోతున్న మంత్రివర్గ విస్తరణలో మున్నూరు కాపులకు మంత్రివర్గంలో చోటు కల్పించాలని మున్నూరు కాపులకు ప్రకటించిన కార్పొరేషన్ కు 5000 కోట్ల బడ్జెట్ రిలీజ్ చేయాలని విధివిధానాలు ప్రకటించాలని మున్నూరు కాపులకు నామినేటెడ్ పదవుల్లో అవకాశాలు కల్పించాలని మీ ప్రభుత్వ ఏర్పాటు మా మున్నూరు కాపులు ఎంతగానో కృషి చేశారని గుర్తుంచుకోవాలి లేనియెడల అతి త్వరలో ప్రభుత్వం పై ఇందిరాపార్క్ ధర్నా చౌక్ల నిరసన దీక్ష కార్యక్రమం మొదలు పెట్టడం జరుగుతుంది. ఇచ్చిన మాట ప్రకారం నిధులు కేటాయించాలని తెలంగాణ మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వనమాల ప్రవీణ్ కుమార్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

## అభివృద్ధి పనులను ప్రారంభించిన బడంగ్పేట్ మేయర్ పారిజాత నరసింహారెడ్డి

**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్):** బడంగ్ పేట్ మున్సిపల్ కార్పోరేషన్ 27, 4, 3వ డివిజన్లోని పలు కాలనీలలో అభివృద్ధి పనులను ప్రారంభించిన కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి. ఈ కార్యక్రమంలో డీఈఈ జ్యోతి రెడ్డి, కార్పొరేటర్ రామిడి మాధురి వీరకర్ణ రెడ్డి, తోట శ్రీధర్ రెడ్డి, గూడెపు ఇంద్రసేన, నాయకులు సంరెడ్డి వెంకట్ రెడ్డి, దిండు శ్రీనివాస్ గౌడ్, ఎదుళ్ల ప్రతాప్ రెడ్డి, రామిడి సురకర్ణా రెడ్డి, జెల్లా రమేశ్ గౌడ్, మహేశ్వరం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వల్లపు సుభాన్ యాదవ్, ఎదుళ్ల ప్రతాప్ రెడ్డి, నర్సింహ, యాతం మహేందర్ కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.



## అల్విన్ కాలనీ డివిజన్ బిజెపి నూతన అధ్యక్షులుగా ఎత్తరి రమేష్

**కూకట్ పల్లి, జనవరి 09 (క్రైమ్ మిర్రర్) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం అల్విన్ కాలనీ డివిజన్ అధ్యక్షులుగా ఎత్తరి రమేష్ ను డివిజన్ బిజెపి క్రియాశీల సభ్యుల ద్వారా అభిప్రాయ సేకరణ చేసి మెజార్టీ సభ్యుల అభిప్రాయం మేరకు అధ్యక్షులుగా నియమించి రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు సామ రంగారెడ్డి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎత్తరి రమేష్ మాట్లాడుతూ నా అధ్యక్ష పదవికి సహకరించిన జిల్లా అధ్యక్షులు సామ రంగారెడ్డి, శేర్లింగంపల్లి బిజెపి కాంటెస్టెడ్ ఎమ్మెల్యే రవికుమార్ యాదవ్, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, ఆల్విన్ కాలనీ డివిజన్ కాంటెస్ట్ కార్పొరేటర్ రవీందర్ రావు, మాధవరం కాంతారావు, డాక్టర్ కొరడాల నరేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నరేందర్ రెడ్డి, బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు రామరాజు, సెక్రెటరీ స్రవంతి, విజిత్ , దుర్గ ప్రసాద్, కేశవరావు, మణిభూషణ్, నర్సింగ్ యాదవ్, నరసింహ చారి, కమలాకర్ రెడ్డి, రాజు, రఘు, తిరునగరి శ్రీనివాస్, మద్దతునిచ్చిన క్రియాశీల సభ్యులకు, పార్టీ నాయకులకు కార్యకర్తలకు ప్రతి ఒక్కరికి పేరు పేరున ధన్యవాదాలు తెలిపారు. అలాగే మా శక్తి కేంద్రం ఇంచార్జ్ గా ఉండి సభ్యత్వ నమోదు, బూత్ కమిటీల ఏర్పాటుకు పూర్తి సహకారం అందించి ప్రోత్సహించిన బీజేవైఎం రాష్ట్ర ఉపాధ్యక్షులు కుమార్ యాదవ్ కు ప్రత్యేక ధన్యవాదాలు అన్నారు. డివిజన్ అధ్యక్షునిగ అందరి సహకారం తీసుకుని బాధ్యతయుతంగా పార్టీని అభివృద్ధి చేయడం కోసం కృషి చేస్తానని అన్నారు.



## ఎస్సారెస్పీ కాకతీయ ప్రధాన కాలువ ద్వారా నీటి విడుదల చేయాలని పెద్దపల్లి జిల్లా రామగిరి మండలం రైతులు డిమాండ్

**పెద్దపల్లి జిల్లా క్రైమ్ మిర్రర్ ప్రతినిధి జనవరి 9:** శ్రీరామ్సాగర్ ప్రాజెక్టు నుంచి కాకతీయ ప్రధాన కాలువ ద్వారా డిసంబర్ (25) ఉదయం 10 గంటలకు నీటిని విడుదల చేస్తున్నట్టు పోచంపాడు ఇరిగేషన్ సర్కిల్ ఎస్సీ శ్రీనివాసరావు గుప్తా తెలిపారు ఇందులో భాగంగా ఆన్ అండ్ ఆఫ్ పద్ధతిలో జోన్ 1 డి ఫైవ్ నుండి డి53 ఆయకట్టకు ఏడు రోజులు డి 54 నుండి డి94 ఆయకట్టకు 8 రోజులు సాగునీటి సరఫరా చేస్తామన్నారు.కానీ ఇంతవరకు సాగునీరు రాకపోవడంతో పంట భూములు పగుళ్లు ఏర్పడడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు



# పేకాట రాయుళ్ల గుట్టురట్టు..!

## 25 మంది పోలీసుల అదుపులో..రూ.3లక్షల 81,830 నగదు 5 కార్లు,6 మోటర్ సైకిల్లు స్వాధీనం...!

### పత్రిక ప్రకటన విడుదల చేసిన జిల్లా ఎస్పీ..!

### పేకాట శిబిరాలు నిర్వహిస్తే కఠిన చర్యలు..!

### ఎస్పీ నారాయణ రెడ్డి..!



**క్రైమ్ మిర్రర్ వికారాబాద్ జిల్లా ప్రతినిధి:** జిల్లాలో ఎక్కడైనా పేకాట శిబిరాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ నారాయణ రెడ్డి హెచ్చరించారు.గురువారం ఎస్పీ కార్యాలయం వెలువడిన పత్రిక ప్రకటనలో వివరాలు ఇలా ఉన్నాయి.జిల్లా ఎస్పీ నారాయణరెడ్డి ఐపీఎస్ ఆదేశాల మేరకు జిల్లా ట్రాస్క్ ఫోర్స్ ఇంచార్జ్ సీఐ ఆంజనేయులు ఆధ్వర్యంలో వికారాబాద్ జిల్లా నవాబ్ పేట్, బషీరాబాద్ మండలాల ఎస్సైలు కే.అరుణ్ కుమార్,శంకర్,సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించి 25 మందిని అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి రూ.3 లక్షల 81,830 నగదు,27 సెల్ ఫోన్స్,5కార్లు,6 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొన్నారు.ఈ సందర్భంగా ఎస్పీ నారాయణ రెడ్డి మాట్లాడుతూ నవాబుపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని గంగ్యాడ గ్రామ శివారులో ఉన్న మల్లేశం (గంగ్యాడ మాజీ సర్పంచ్) ఫామ్ హౌస్ లో స్థానికులు, స్థానికేతరులు కలిసి పేకాట ఆడుతున్నారన్న పక్కా సమాచారంతో టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడులు చేశారని,అదే విధంగా బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నావల్ల గ్రామంలో కూడ పేకాట స్థావరం పై ట్రాస్క్ ఫోర్స్ సీఐ ఆంజనేయులు ఆధ్వర్యంలో రెండు చోట్ల దాడులు చేశారు.ఈ ఘటనలు నవాబ్ పేట్, బషీరాబాద్ పోలీస్టేషన్ల పరిధిలోకి రావడంతో వారి వివరాలను సేకరించి పట్టుబడిన పేకాటరాయుళ్లను,నగదు, వాహనాలను పోలీసులకు అప్పగించారు.ఈ మేరకు ఎస్సైలు కే.అరుణ్ కుమార్, శంకర్ లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారని చెప్పారు.ఎవరైనా ఎక్కడైనా పేకాట ఆడిన,ఇసుక,పిడిఎస్ రైస్ అక్రమ రవాణా చేసిన,అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్పీ హెచ్చరించారు.ఇలాంటి సంఘటనలు ఎక్కడైనా జరిగినట్లు సమాచారం తెలిస్తే జిల్లా టాస్క్ ఫోర్స్ ఇంచార్జ్ సిఐ ఆంజనేయులు సెల్ ఫోన్ 8212670022 నంబర్ కి కాల్ చేసి తెలియపరచాలని, సమాచారం తెలిపిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని పేర్కొన్నారు.



## విపంచి ఫౌండేషన్ఆధ్వర్యం లో - స్టడీ మెటీరీయల్ పంపిణీ

**చిట్యాల క్రైమ్ మిర్రర్:** గుండ్రాంపల్లి,ఏపూరు ,బోయగుబ్బ ప్రభుత్వ పాఠశాలల్లో స్టడీ మెటీరీయల్ పంపిణీ విపంచి ఫౌండేషన్ ఆధ్వర్యం లో నాల్గవ తరగతి చదివే విద్యార్థులకు గురుకులం స్టడీ ఉచిత మెటీరీయల్ ను మండలం లోని గుండ్రాంపల్లి ,ఏపూరు ,బోయగుబ్బ ప్రభుత్వ పాఠశాలల్లో అందచేయడం జరిగింది. గుండ్రాంపల్లి లో జరిగిన స్టడీ మెటీరియల్ పంపిణీ కార్యక్రమం లో స్థానిక కాంప్లెక్స్ హెడ్మాస్టర్ ఏ.వెంకట్ రెడ్డి,విపంచి ఫౌండేషన్ చైర్మెన్ అనుముల శ్రీనివాస్ లు సంయుక్తంగా నాల్గవ తరగతి చదివే విధ్యార్థులకు గురుకులం స్టడీ మెటీరీయల్ అందచేశారు. ఈ సందర్బంగా కాంప్లెక్స్ హెడ్మాస్టర్ మాట్లాడుతూ పేదపిల్లల అభ్యున్నతికి విపంచి ఫౌండేషన్ వారు స్టడీ మెటీరియల్ ఉచితంగా అందచేయడం అభినందనీయం అన్నారు. ఈ సందర్బంగా విపంచి ఫౌండేషన్ చైర్మన్ అనుముల శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు పేదరికాన్ని జయించి విద్యా ఉపాది అవకాశాలు పెంపొందిచుకోవాలని దానికి విపంచి ఫౌండేషన్ ఎల్లవేళలా సహకరిస్తామని అన్నారు. ప్రాథమిక పాఠశాల హెడ్మాస్టర్ అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో కూరెళ్ళ నర్సింహా చారి ,వెల్లంకి లక్ష్మణాచారి, ఏపూరులో జరిగిన కార్యక్రమంలో పాఠశాల హెడ్ మాస్టర్ గరిశే అంజయ్య ,వి .కిష్ణ ,బోడిగే ఓం నమశివాయ, బోయగుబ్బ జరిగిన కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్ కోమటిరెడ్డి శ్రీనివాస రెడ్డి ఉపాధ్యాయులు గోపాగొని శ్రీనివాస్ ,అనురాధ,శాంతి విద్యార్థులు పాల్గొన్నారు

## గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు సక్రమంగా నిర్వహించాలి

### డీపీఓ కొండా వెంకటయ్య

### పంచాయతీ కార్యదర్శులతో సమావేశం

### వైకుంఠ ధామాలు అందుబాటులోకి తేవాలి

### ప్రతి గ్రామములో శానిటేశన్ చేయాలి



గ్రామాల్లో శానిటేషన్ పారిశుద్ధ్య పనులు సక్రమంగా నిర్వహించాలి అని జిల్లా పంచాయతీ అధికారి కొండా వెంకటయ్య సూచించారు.మునుగోడులో మండల పంచాయతీ అధికారులు,కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేశారు.ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో మురుగు కాలువలు ప్రతి రోజూ శుభ్రం చేయాలన్నారు.ప్రతి ఇంటి నుండి తడిపొడి చెత్తను సగ్రిగేశన్ షెడ్డుకు తరలించి,కంపోస్టు ఎరువు తయారు చేయాలని తెలిపారు.ప్రభుత్వ వసతి గృహాల్లో క్లీనింగ్ చేయాలని,నీటి సౌకర్యం కల్పించాలన్నారు.ప్రతి ఇంటి యజమానికి డిమాండ్ నోటీసు అందజేసి టాక్స్ కలెక్షన్ వంద శాతం చేసి, ట్రెజరిలో జమ చేసి,ఆన్లైన్ లో అప్డేట్ చేయాలన్నారు. వైకుంఠ ధామాలను అందుబాటులో తీసుకురావాలని,గ్రామ పంచాయతీ ట్రాక్టర్ లను కండిషన్ లో ఉంచాలని సూచించారు..గ్రామ పంచాయతీ అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ జామ్‌లు కాకుండా ప్రత్యేక చర్యలు

### రాజేంద్రనగర్ ట్రాపిక్ ఏసీపీ బాలాజీ



**గండిపేట్(క్రైం మిర్రర్):** వాహనాదారులకు కలుగుతున్న ఇబ్బందులను తెలుసుకోని వాటిని పరిష్కరిస్తున్నామని రాజేంద్రనగర్ ట్రాపిక్ ఏసీపీ బాలాజీ తెలిపారు. గురువారం జీహెచ్ఎంసీ, విద్యుత్ అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. ప్రధానంగా సమస్యలు ఎదురవుతున్న ఆరాంఘర్, లక్ష్మిగూడ, దుర్గానగర్, పిల్లర్ నెంబర్ 292ల వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్, ఎలక్ట్రికల్ పోల్ షిఫ్టింగ్ తదితర వాటిపై సమీక్షించారు. అధికారులకు వాటిని తొలగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీసులు, అధికారులు పాల్గొన్నారు.





## దర్గాగా దేవాలయ భూమిలో కబ్జాలు

### అనంత పద్మనాభ స్వామి ఆలయ భూమిగా నిర్ధారణ

### భారీ పోలీసుల బందోబస్తు మధ్య అక్రమ నిర్మాణాల కూల్చివేత

**గండిపేట్(క్రైం మిర్రర్):** అక్రమంగా దేవాదాయ భూములను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను శుక్రవారం అధికారులు కూల్చివేశారు. దాదాపు 400 కోట్ల విలువ చేసే దేవాదాయ ధర్మాదాయ శాఖ భూములను కబ్జా చేశారు. అత్తాపూర్ డివిజన్ హైదర్‌గూడ జనప్రియ ప్రాంతంలో అనంత పద్మనాభ స్వామి దేవాలయానికి సంబంధించిన నాలుగు ఎకరాలలో వేసిన అక్రమ నిర్మాణాలను గురువారం నెలమట్టం చేశారు. దేవాదాయ శాఖ రంగారెడ్డి జిల్లా అసిస్టెంట్ కమీషనర్ శేఖర్ ఆధ్వర్యంలో భారీ పోలీసు బందోబస్తు మధ్య కూల్చివేతలను నిర్వహించారు. కూల్చివేతల సమయంలో స్థానికులకు, అధికారులకు మధ్య తీవ్ర వాగ్వివాదం చోటు చేసుకుంది. పోలీసులు కలగజేసుకోని వారిని అక్కడ నుంచి పంపించి కూల్చివేతలను చేపట్టారు. జేసీబీలతో అక్రమంగా వెలిసిన షెడ్డులను తొలగించారు. పలుమార్లు నోటీసులు ఇచ్చిన ఏ ఒక్కరు స్పందించలేదని కోర్టు ఆదేశాల మేరకే అక్రమ నిర్మాణాలను కూల్చివేసినట్లు అధికారులు తెలిపారు. అనంత పద్మనాభ స్వామి ఆలయానికి సంబంధించి భూముల్లో నిర్మాణాలు చేపడితే వాటిని కూల్చివేయడంతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

## ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల క్షేత్ర పర్యటన

### జెండా ఊపి ప్రారంభించిన కౌన్సిలర్ రామకృష్ణారెడ్డి







గండిపేట్(క్రైం మిర్రర్): భారత ప్రధానమంత్రి నరేంద్రమోడీ సహకారంతో మణికొండ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు క్షేత్ర %-% పర్యటన(ఫీల్డ్ ట్రిప్) వరంగల్‌లోని వివిధ విజ్ఞాన కేంద్రాలను సందర్శించేందుకు వెళ్లారు. ఈ కార్యక్రమానికి కౌన్సిలర్ రామకృష్ణారెడ్డి ముఖ్య అతిథిగా హజరై విద్యార్థుల విహార యాత్రను జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విహార విజ్ఞాన యాత్రలో విశిష్టతలను తెలుసుకోవాలన్నారు. విద్యార్థులకు కావాల్సిన విజ్ఞానాన్ని పొంది క్షేమంగా రావాలని ఆయన సూచించారు.




## స్వీపింగ్ పనులను సక్రమంగా నిర్వహించాలి

### బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ బి.శరత్‌చంద్ర

**గండిపేట్(క్రైం మిర్రర్):** పరిసరాల పరిశుభ్రంగా ఉంచేందుకు కార్మికులు స్వీపింగ్ పనులను సక్రమంగా నిర్వహించాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ బి.శరత్‌చంద్ర అన్నారు. 11వ డివిజన్‌లోని దర్గాఖలీజ్‌ఖాన్, 20వ డివిజన్‌లోని ఖాళీమందిర్, 15వ డివిజన్‌లోని వినాయక టెంపుల్ సమీపంలో ప్రధాన రహదారిపై జరుగుతున్న పారిశుధ్య పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికులు తమ విధులను సక్రమంగా నిర్వహించాలన్నారు. పనులు చేసే సమయంలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ జవాన్లు మీర్జా తౌఫిక్, యాదగిరి, వెంకటేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

## భవనం స్లాబ్ సెంట్రింగ్ కూలి ఏడుగురికి గాయాలు



**గండిపేట్(క్రైం మిర్రర్):** బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నిర్మాణంలో ఉన్న భవన స్లాబ్ సెంట్రింగ్ కూలిన సంఘటనలో ఏడుగురు కార్మికులకు గాయాలైయ్యాయి. వారిని హుటాహుటిన ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు. వివరాల ప్రకారం బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ ప్రాంతంలో లీగ్ లీడింగ్ ది చేంజ్ నిర్మాణ సంస్థ నిర్మాణాలు కొనసాగింది. ఈ సమయంలో స్లాబ్ సెంట్రింగ్ కూలిపోయి కిందపడింది. ఒక్కసారిగా ఏడుగురు కార్మికులపై కుప్పకూలి పడిపోయింది. కార్మికులకు తీవ్ర గాయాలు కావడంతో హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. చాలా కష్టం మీద కార్మికులను బయటకు తీయాల్సిన పరిస్థితి నెలకొంది. నిర్మాణంలో ఉన్న భవనం వద్ద స్లాబ్ కోసం సెంట్రింగ్ కోడుతుండగా ఈ ప్రమాదం జరిగిందని ఎలాంటి జాగ్రత్త పాటించకుండా నిర్మాణాలు చేపడుతున్నారని స్థానికులు నిర్మాణ సంస్థపై మండిపడ్డారు. కార్మికుల ప్రాణాలతో చలగాటం ఆడుతూ నిర్మాణ సంస్థ వ్యవహరిస్తుంది. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం కార్పొరేషన్ మేయర్ మద్దెల లతా ప్రేమ్ గౌడ్ సంఘటన స్థలాన్ని సందేశించి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు గాయాలకు గురైన కార్మికుల ఆరోగ్య సిథిపై సమాచార తెలుసుకున్నారు....

## ఉప్పర్‌పల్లిలో పికిల్ బాల్ కోర్టును ప్రారంభించిన హైడ్రా కమీషనర్ రంగనాథ్

**గండిపేట్(క్రైం మిర్రర్):** క్రీడారంగంలో క్రీడాకారులు ఉత్తమ శిక్షణ తీసుకోని రాణించాలని హైడ్రా కమీషనర్ రంగనాథ్ తెలిపారు. ఉప్పర్‌పల్లిలోని రాపిడాకెజ్ బ్యాడ్మింట్ అండ్ ఫిట్ నెస్ అకాడామీని ఆయన సందర్శించారు. పికిల్ బాల్ కోర్టును ఆయన ముఖ్య అతిధిగా హజరై ప్రారంభించారు. నగరంలో ఇప్పుడిప్పుడే ప్రాచుర్యం పొందుతున్న ఈ క్రీడ గురించి నిర్వహకులు ఆయనకు వివరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఐపీఎస్ అధికారి బాబురావు, బొక్క బాల్‌రెడ్డి, విశ్వేశ్వరరావు, ప్రకాష్, శ్రీనాథ్, సరికొండ రాజు, కిషోర్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



## తొక్కిసలాట ఘటనపై రాష్ట్రపతి, ప్రధాని దిగ్భ్రాంతి

### మృతుల కుటుంబాలకు ముర్ము, మోడీల సంతాపం

**న్యూఢిల్లీ,(క్రైమ్ మిర్రర్):** బుధవారం తిరుపతిలో జరిగిన తొక్కిసలాటలో ఘటన పట్ల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తంచేశారు. మృతుల కుటుంబాలకు తన హృదయపూర్వక సానుభూతిని తెలిపారు. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ఆమె కోరారు. ఈ మేరకు ఆమె సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. ‘తిరుపతిలో జరిగిన తొక్కిసలాటలో చాలా మంది మరణించారని తెలిసి బాధపడ్డాను. మృతుల కుటుంబాలకు నా హృదయపూర్వక సానుభూతిని తెలియజేస్తున్నాను. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను‘ అని రాష్ట్రపతి ముర్ము ఎక్స్ పై ఒక పోస్ట్‌లో తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తిరుపతి తొక్కిసలాటలో ప్రాణాలు కోల్పోవడం పట్ల సంతాపం తెలిపారు. ఈ మేరకు ఎక్స్ పై ఒక పోస్ట్‌లో ప్రధానమంత్రి కార్యాలయం ఇలా పేర్కొంది. ‘ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతిలో జరిగిన తొక్కిసలాట బాధాకరం. తమ సన్నిహితులను మరియు ప్రియమైన వారిని కోల్పోయిన వారి పట్ల నా సానుభూతి. గాయపడినవారు త్వరగా కోలుకోవాలని నేను ప్రార్థిస్తున్నాను. బాధితులకు ఏపీ ప్రభుత్వం అన్ని విధాలుగా సహాయం అందిస్తోంది.‘ అని పేర్కొన్నారు. తిరుమల కొండలపై వెంకటేశ్వర స్వామి ఆలయంలో వైకుంఠ ద్వార దర్శనం టిక్కెట్ల కోసం బుధవారం రాత్రి వందలాది మంది భక్తులు పోటీ పడుతుండగా జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు మరణించగా, డజన్ల కొద్దీ మంది గాయపడ్డారు.



## రుపతి ఘటనపై చంద్రబాబు సీరియస్

- అధికారుల తీరుపై మండిపడ్డ సిఎం
- కొత్త ప్రదేశం ఎంపిక చేస్తే జాగ్రత్తలు తీసుకోరా
- అంబులెన్స్ ఆలస్యంపైనా అధికారులపై అసహనం
- బాధ్యతలు తీసుకున్నప్పుడు సక్రమంగా నెరవేర్చరా
- బైరాగిగడ్డ ఘటనా స్థలిని పరిశీలించిన చంద్రబాబు
- అధికారుల అలసత్వంపై తీవ్ర ఆగ్రహం



**తిరుపతి,(క్రైమ్ మిర్రర్):** తిరుపతి తొక్కిసలాట ఘటన నేపథ్యంలో అధికారులపై సీఎం చంద్రబాబు నాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఈ ఘటనలో నిర్లక్ష్యం వహించిన వారిని వదిలే సమస్యే లేదని హెచ్చరించారు. టీటీడీ అధికారులపైనా సీఎం సీరియస్ అయ్యారు. ఇంత జరుగుతున్నా ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. కొత్త ప్రదేశంలో పంపిణీకి సిద్ధమైనప్పుడు అధికారులు ఏం చర్యలు తీసుకున్నారని ప్రశ్నించారు. పలువురు అధికారులు సీఎంకి సమాధానం చెప్పారు. డిఎస్పీ వల్లే ఘటన జరిగిందని అధికారులు తెలిపారు. భక్తులు మొదట ప్రశాంతంగానే ఉన్నారని.. ఎలాంటి ముందు జాగ్రత్తలు తీసుకోకుండా డిఎస్పీ గేటు తెరవడంతో ఈ ఘటన చోటుచేసుకుందని అధికారులు సమధానమిచ్చారు. అనంతరం సీఎం బాధితులను కలిసేందుకు ఆస్పత్రికి వెళ్లారు. వాళ్ళు ఎవరో పెట్టారని మీరు కూడా అదే ఫార్ములాను పాటించడమేంటని సీఎం ఫైర్ అయ్యారు. ‘ఘటన జరకముందు చేస్తే అడ్మినిస్ట్రేషన్ జరిగాక చేస్తే గుడ్ అడ్మినిస్ట్రేషన్ ఎలా అవుతుంది? టెక్నాలజీని వాడుకుని టికెట్లు ఇవ్వడం తెలియదా? జేఈవోగా మీరు చేయాల్సిన బాధ్యత గుర్తులేదా? భక్తుల రద్దీనీ దృష్టిలో పెట్టుకుని టికెట్లు ఇవ్వాలని తెలియదా? భక్తుల నుంచి ఫిర్యాదు వస్తే మీరేం చేశారు? ఘటన తరువాత మీరు చేసింది ఏంటి? కనీసం వాట్సాప్ గ్రూప్ ద్వారా మీ సిబ్బంది అదేశాలు ఇవ్వలేరా?‘ అని సీఎం చంద్రబాబు ప్రశ్నించారు. తిరుపతిలో తొక్కిసలాట జరిగిన ప్రాంతాలను ఏపీ సీఎం చంద్రబాబు పరిశీలించారు. విజయవాడ నుంచి బయల్దేరి రేణిగుంట విమానాశ్రయానికి చేరుకుని అక్కడి నుంచి తిరుపతి వచ్చారు. నగరంలోని బైరాగిపట్టెడ వద్ద ఘటనాస్థలాన్ని పరిశీలించి అధికారులతో మాట్లాడారు. ఘటనకు గల కారణాలు, ప్రభుత్వం తరఫున బాధితులకు అందిస్తున్న సహాయ కార్యక్రమాల గురించి సీఎం అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా తితిదే ఈవో శ్యామలరావు, జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఇతర అధికారులపై సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ ఘటన ఎందుకు జరిగిందో సమాధానం చెప్పాలన్నారు. ‘భక్తుల రద్దీ పెరుగుతుంటే తితిదే అధికారులు ఏం చేస్తున్నారు? ప్రతి ఒక్కరికీ చెబుతున్నా.. బాధ్యత తీసుకున్నప్పుడు దాన్ని నెరవేర్చాలి. తమాషా అనుకోవద్దు‘ అని వ్యాఖ్యానించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం అంబులెన్స్‌ల లభ్యత గురించి సీఎం ఆరా తీశారు. బైరాగిపట్టెడలో తొక్కిసలాట జరిగిన ప్రాంతాన్ని పరిశీలించిన ఆయన.. కలెక్టర్, ఎస్పీపై, అలాగే టీటీడీ అధికారులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విధులు కేటాయించిన పోలీసు అధికారికి ఎలాంటి జాగ్రత్తలు చెప్పారని అడిగారు. ఇది క్షమించాల్సిన తప్పు కాదన్నారు. టికెట్లు పంపిణీ కేంద్రంలో తొక్కిసలాటల నియంత్రణకు ముందస్తుగా ఎలాంటి చర్యలు తీసుకున్నారని అధికారులను ప్రశ్నించారు. ఇంతమంది అధికార యంత్రాంగం ఉండి టికెట్ల పంపిణీ ఎందుకు సవ్యంగా చేయలేకపోయారు?.. ఆఫ్‌లైన్, ఆన్‌లైన్‌లో ఎన్ని టికెట్లు జారీ చేశారు.

## టిటిడి నిర్లక్ష్యమే కొంప ముంచింది

### మృతుల కుటుంబాలకు కోటి పరిహారం ఇవ్వాలి

### మాజీ ఛైర్మన్ భూమన కరుణాకర్ డిమాండ్

**తిరుపతి,(క్రైమ్ మిర్రర్):** తిరుపతిలో జరిగిన తొక్కిసలాట ఘటనలో టీటీడీ విజిలెన్స్, పోలీసుల వైఫల్యమే కారణమని టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి ఆరోపించారు . తిరుమలలో వైకుంట ద్వార దర్శనం సందర్భంగా తిరుపతిలో ఏర్పాటు చేసిన టోకెన్ల జారీ కేంద్రంలో జరిగిన తొక్కిసలాటలో ఆరుగురు చనిపోగా 48 మంది గాయపడ్డారు. ఈ ఘటనపై ఆయన గురువారం తిరుపతిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. వేలాది మంది భక్తులు టోకెన్ల కోసం కేంద్రాలకు రాగా కొద్ది మంది మాత్రమే అక్కడ పోలీసులు ఉండడంతో భక్తులను నియంత్రించలేకపోయారని ఆరోపించారు. వైకుంఠ ఏకాదశికి ఏర్పాట్లపై నెలరోజులుగా రోజుకో సమీక్షను నిర్వహించి చివరకు చేతులెత్తేయడంతో ఘటన జరిగిందని విమర్శించారు. పనిచేసేవారు తక్కువై, పర్యవేక్షించే వారు ఎక్కువయ్యారని పేర్కొన్నారు. చంద్రబాబుకు ఆర్భాటం ఎక్కువ, ఆచరణ తక్కువ ఉంటుందని ఎద్దేవా చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో టీటీడీ సమర్ధవంతంగా పనిచేసిందని గుర్తు చేశారు. భక్తులకు మేలైన నిర్ణయాలే తీసుకున్నామని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకున్నామని వివరించారు. ప్రస్తుత టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు టీటీడీని రాజకీయ క్రీడా మైదానంగా మార్చివేశారని దుయ్యబట్టారు. ఇది ముమ్మాటికి ప్రభుత్వ తప్పిదమేనని అన్నారు. మృతుల కుటుంబాలకు రూ. కోటి, క్షతగాత్రులకు రూ. 20 లక్షల పరిహారాని చెల్లించాలని డిమాండ్ చేశారు. సనాతన ధర్మాన్ని రక్షిస్తామన్న పవన్‌కల్యాణ్ ఇప్పుడేం సమాధానం చెబుతారని ప్రశ్నించారు.

## తిరుపతి ఘటనపై సిఎం చంద్రబాబుకు నివేదిక



**అమరావతి,(క్రైమ్ మిర్రర్):** తిరుమలలో తొక్కిసలాట ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు అధికారులు నివేదిక అందజేసినట్లు తెలుస్తోంది. డీఎస్పీ అత్యుత్సాహం వల్ల ఒక్కసారిగా భక్తులు రావడంతో తొక్కిసలాట జరిగిందని.. ఘటనపై డీఎస్పీ సరిగా స్పందించలేదని నివేదికలో పేర్కొన్నట్లు సమాచారం. ‘ఎస్పీ వెంటనే సిబ్బందితో వచ్చి భక్తులకు సాయం చేశారు. అంబులెన్స్ వాహనాన్ని టికెట్ కౌంటర్ బయట పార్క్ చేసి డ్రైవర్ వెళ్లిపోయాడు. 20 నిమిషాల పాటు డ్రైవర్ అందుబాటులోకి రాలేదు. డీఎస్పీ, అంబులెన్స్ డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే భక్తులు చనిపోయారు‘ అని నివేదికలో వెల్లడించినట్లు తెలుస్తోంది. ఈ ఘటన జరిగిన తర్వాత డీఎస్పీ తీరుపై ఎస్పీ సుబ్బారాయుడుకు కలెక్టర్ ఫిర్యాదు చేశారు. వైకుంఠద్వార దర్శనం టోకెన్ల జారీలో తొక్కిసలాట జరిగి ఆరుగురు భక్తులు మృతి చెందారు. ఈ ఘటనపై దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సిఎం చంద్రబాబు.. డీజీపీ, టీటీడీ ఈవో, తిరుపతి కలెక్టర్, ఎస్పీలతో టెలీకాన్ఫరెన్స్ లో మాట్లాడారు. ఘటనకు కారణాలు, ప్రస్తుత పరిస్థితిపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వైకుంఠద్వార దర్శనం టోకెన్ల కోసం వచ్చే భక్తులకు తగిన ఏర్పాట్లు ఎందుకు చేయలేదని అధికారులపై చంద్రబాబు ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది.

## తిరుపతి ఘటనపై పురంధేశ్వరి దిగ్భ్రాంతి

### బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్

**అమరావతి,(క్రైమ్ మిర్రర్):** తిరుపతి తోపులాటలో భక్తుల మృతిపై బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గాయాలైన వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. తిరుమల తిరుపతి చరిత్రలో ఇటువంటి దుర్ఘటన ఎప్పుడూ జరగలేదన్నారు. ఉన్నత స్థాయి దర్యాప్తు జరిపి బాధ్యతారాహిత్యంగా వ్యవహరించిన అందరిపైనా పాలక మండలి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు...తిరుమల శ్రీవారి వైకుంఠ ద్వార దర్శనం టోకెన్ల కోసం తిరుపతిలోని విష్ణు నివాసం దగ్గర జరిగిన తోపులాటలో భక్తులు మృతి చెందడంపై బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. టోకెన్ల కోసం భక్తులు పెద్దఎత్తున తరలివచ్చిన సందర్భంలో చోటుచేసుకున్న ఘటనలో భక్తులు ప్రాణాలు కోల్పోవడం తన హృదయాన్ని కలచి వేసింది అన్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు. బాధితకుటుంబాలకు అన్ని విధాలా న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దేవుడా క్షమించు తగిన ఏర్పాట్లు చేయలేకపోయామంటూ నిర్వేదం వ్యక్తం చేశారు.

## ఢిల్లీ ఎన్నికల్లో ఒక్కస్థానం నుంచే పోటీ చేస్తున్నా : కేజ్రీవాల్



**న్యూఢిల్లీ,(క్రైమ్ మిర్రర్):** దేశ రాజధాని ఢిల్లీలో రాజకీయాలు వేడెక్కాయి. మరో నెల రోజుల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతుండటంతో.. అధికార, విపక్ష పార్టీలు ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. ఈ క్రమంలో ఒకరిపై ఒకరు తీవ్ర విమర్శలు చేసుకుంటున్నారు. ఈ ఎన్నికల్లో ఢిల్లీ మాజీ సీఎం, ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ రెండు స్థానాల నుంచి పోటీ చేస్తున్నారంటూ బీజేపీ ఆరోపిస్తున్న విషయం తెలిసిందే. న్యూ ఢిల్లీతోపాటు మరో స్థానం నుంచి కేజ్రీ పోటీ చేయబోతున్నారంటూ బీజేపీ నేతలు పేర్కొంటున్నారు. ఈ ఆరోపణలపై కేజ్రీవాల్ తాజాగా స్పందించారు. బీజేపీ నేతల ఆరోపణలను ఖండించారు. తాను కేవలం ఒక్క స్థానం నుంచే పోటీ చేస్తున్నట్లు స్పష్టం చేశారు. కాగా, న్యూ ఢిల్లీ స్థానం నుంచి కేజ్రీ వరుసగా నాలుగోసారి పోటీకి సిద్ధమయ్యారు. ఈ స్థానం నుంచి కేజ్రీవాల్‌పై బీజేపీ తరఫున మాజీ ఎంపీ పర్వేశ్ వర్మ, కాంగ్రెస్ అభ్యర్థి సందీప్ దీక్షిత్ పోటీ చేస్తున్నారు. మరోవైపు 2015, 2020 అసెంబ్లీ ఎన్నికల్లో వరుసగా రెండుసార్లు 67, 62 స్థానాలతో ఆప్ క్లీన్ స్వీప్ చేసింది. హ్యాట్రిక్ విక్టరీతో మూడోసారి అధికారంలోకి రావాలని ఆ పార్టీ భావిస్తున్నది. 70 మంది సభ్యులున్న ఢిల్లీ అసెంబ్లీకి ఫిబ్రవరి 5న పోలింగ్ జరుగనున్నది. ఫిబ్రవరి 8న ఓట్లు లెక్కించి ఫలితాలు ప్రకటిస్తారు.

## నిజ్జర్ హత్య కేసులో నలుగురికి ఊరట

### బెయిల్ మంజూరు చేసిన కోర్టు

**న్యూఢిల్లీ,(క్రైమ్ మిర్రర్):** ఖలిస్థానీ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్య ఘటనలో అరెస్టయిన నలుగురికి బెయిల్ మంజూరయ్యింది. ఈ హత్యా ఘటన తరవాత భారత్, కెనడా ల మధ్య దౌత్య విభేదాలు నెలకొన్న సంగతి తెలిసిందే. ఈ కేసుపై దర్యాప్తు చేపట్టిన టొరంటో పోలీసులు.. గతేడాది నలుగురు భారతీయులను నిందితులుగా పేర్కొంటూ అరెస్టు చేశారు. తాజాగా వారికి బెయిల్ మంజూరైంది. నిజ్జర్ కేసు లో ఫస్ట్ డిగ్రీ అభియోగాలపై కరణ్ బ్రార్, కమల్ ప్రీత్ సింగ్, కరణ్ ప్రీత్ సింగ్, అమర్‌దీప్ సింగ్‌ను గతేడాది మే నెలలో కెనడా పోలీసులు అరెస్టు చేశారు. భారత్‌కు చెందిన వీరిలో ముగ్గురు ఎడ్మంటర్ ప్రాంతంలో నివసిస్తుండగా.. అమర్‌దీప్ బ్రాంప్టన్ వాసి. గత కొన్ని నెలలుగా జైల్లో ఉన్న వీరికి కెనడాలోని దిగువ కోర్టు తాజాగా బెయిల్ మంజూరుచేసింది. అనంతరం ఈ కేసు విచారణను బ్రిటీష్ కొలంబియా సుప్రీంకోర్టుకు బదిలీ చేస్తున్నట్లు తెలిపింది. దీనిపై ఫిబ్రవరి 11న తదుపరి విచారణ జరగనుంది. ఖలిస్థానీ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ 2023 జూన్‌లో బ్రిటీష్ కొలంబియాలోని సర్రే ప్రాంతంలో హత్యకు గురైన సంగతి తెలిసిందే. ఈ ఘటన వెనక భారత ఏజెంట్ల హస్తం ఉందంటూ అప్పట్లో కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో చేసిన ఆరోపణలతో రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు భగ్గుమన్నాయి. ఈ ఆరోపణలను భారత్ తీవ్రంగా ఖండించింది. వాటిని సమర్థించే ఆధారాలు ఇవ్వాలని.. ఆ తర్వాతే తదుపరి చర్యలు తీసుకుంటామని పలుమార్లు స్పష్టంగా చెప్పింది. అయినప్పటికీ కెనడా మాత్రం ఆరోపణలు చేయడం మానలేదు. ఈక్రమంలోనే నిజ్జర్ హత్య కేసు అనుమానితుల జాబితాలో భారత హైకమిషనర్ సంజయ్‌కుమార్ వర్మ పేరును చేర్చడంతో ఉద్రిక్తతలు మరింత తీవ్రమయ్యాయి. ఈ పరిణామాల నేపథ్యంలో సంజయ్‌వర్మ సహా ఆ దేశంలోని మన దౌత్యవేత్తలను భారత్ వెనక్కి రప్పించింది. అదే సమయంలో దిల్లీలోని కెనడా తాత్కాలిక హైకమిషనర్ సహా ఆరుగురు దౌత్యవేత్తల్ని బహిష్కరించాలన్న నిర్ణయం తీసుకుంది.

## ఇస్రో స్పేడెక్స్ మిషన్‌లో ఆ ప్రక్రియ మళ్లీ వాయిదా

**న్యూఢిల్లీ,(క్రైమ్ మిర్రర్):** భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ చేపట్టిన స్పేడెక్స్ మిషన్‌లో వ్యోమనౌకల అనుసంధాన ప్రక్రియ మళ్లీ వాయిదాపడింది. ఇస్రో ఇటీవల రీషెడ్యూల్ చేసిన ప్రణాళిక ప్రకారం.. ఈ ప్రక్రియ ఇవాళ ఉదయం 8 గంటలకు ప్రారంభం కావాల్సి ఉంది. అయితే ఉపగ్రహాల మధ్య దూరం ఊహించిన దానికంటే ఎక్కువగా ఉండటంతో అనుసంధాన ప్రక్రియను మరోసారి వాయిదా వేసినట్లు ఇస్రో ప్రకటించింది. ఇస్రో రెండు ఉపగ్రహాల మధ్య దూరాన్ని 500 నుంచి 225 మీటర్లకు తగ్గించేందుకు ఓ ప్రయోగం నిర్వహించింది. అయినా రెండు శాటిలైట్స్ మధ్య దూరం ఊహించిన దానికంటే ఎక్కువగా ఉండటంతో మరోసారి స్పేడెక్స్ డాకింగ్‌ను వాయిదా వేసింది. ఈ విషయాన్ని ఇస్రో తన సోషల్ మీడియా ప్లాట్?ఫామ్ ఎక్స్ ద్వారా వెల్లడించింది. ప్రస్తుతం రెండు ఉపగ్రహాలు సురక్షితంగా ఉన్నాయని తెలిపింది. అయితే ఈ డాకింగ్?ప్రక్రియ రీషెడ్యూల్ తేదీని మాత్రం ప్రకటించలేదు. మొదట స్పేడెక్స్ మిషన్‌లో డాకింగ్ ప్రక్రియను జనవరి 7న నిర్వహించేందుకు ఇస్రో ప్లాన్ చేసింది. అయితే మిషన్‌లో కొన్ని సాంకేతిక అవరోధాలు తలెత్తడంతో జనవరి 9వ తేదీకి రీషెడ్యూల్ చేసింది. ఇవాళ కూడా డాకింగ్ సాధ్యపడకపోవడంతో మరోసారి రీషెడ్యూల్ చేయాల్సి వచ్చింది. కాగా ఇస్రో 2024 డిసెంబర్ 30న రాత్రి 10:00:15 గంటలకు శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం నుంచి స్పేస్ డాకింగ్ ఎక్స్‌పెరిమెంట్ (స్పేడెక్స్) ప్రయోగాన్ని చేపట్టింది.

## ఛత్తీస్‌గఢ్‌లో మరోసారి ఎన్‌కౌంటర్

### ముగ్గురు నక్సల్స్ హతం



**ఛత్తీస్‌గఢ్, (క్రైమ్ మిర్రర్):** ఛత్తీస్‌గఢ్‌లో మరోసారి ఎన్‌కౌంటర్ చోటు చేసుకుంది. సుక్మా జిల్లాలో బీజాపూర్ సరిహద్దు వద్ద భద్రతా బలగాలు, నక్సలైట్ల కు మధ్య గురువారం ఎదురుకాల్పులు చోటు చేసుకున్నాయి. భద్రతా సిబ్బంది గురువారం ఉదయం సుక్మా-బీజాపూర్ సరిహద్దులోని అటవీప్రాంతంలో నక్సలైట్ వ్యతిరేక ఆపరేషన్ చేపట్టారు. ఈ క్రమంలో అక్కడ ఎన్‌కౌంటర్ చోటు చేసుకుంది. ఈ ఘటనలో ముగ్గురు నక్సలైట్లు హతమయ్యారు. ప్రస్తుతం ఆ ప్రాంతంలో సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతున్నట్లు సుక్మా ఎస్పీ కిరణ్ చావన్ తెలిపారు. కాగా, మూడు రోజుల క్రితం ఛత్తీస్‌గఢ్‌లో మావోయిస్టులు దుశ్చర్యకు పాల్పడిన విషయం తెలిసిందే. జవాన్ల వాహనాన్ని లక్ష్యంగా చేసుకుని మావోయిస్టులకు పేలుళ్లకు పాల్పడ్డారు. బీజాపూర్ జిల్లా భేద్రే కుట్రు రహదారిలో ఐఈడీ పేలుళ్లకు మావోయిస్టులు పాల్పడ్డారు. ఐఈడీ పేలిన సమయంలో పోలీసుల వాహనంలో 15 మంది డీఆర్‌జీ జవాన్లు ఉన్నారు. ఈ దుశ్చర్యలో 8 మంది జవాన్లతో పాటు డ్రైవర్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోగా, మరో ముగ్గురు జవాన్లకు తీవ్ర గాయాలయ్యాయి.

## గర్ల్‌ఫ్రెండ్ కోసం గ్యాంగ్‌స్టర్ 12 కార్లతో స్టంట్

### వైరల్ అవుతున్న వీడియో



**కాన్పూర్, (క్రైమ్ మిర్రర్):** గర్ల్‌ఫ్రెండ్ బర్త్‌డే సందర్భంగా.. యూపీలోని గ్యాంగ్‌స్టర్ అజయ్ థాకూర్.. బ్లాక్ కార్లతో స్టంట్ చేశాడు. 12 నలుపు రంగు కార్లతో అతను తన గర్ల్‌ఫ్రెండ్ బర్త్‌డేను సెలబ్రేట్ చేసుకున్నాడు. ఆ కార్లకు బ్లాక్ ఫిల్మ్ వేసి, నెంబర్ ప్లేట్లు లేకుండా.. కాన్పూర్ సిటీలో హంగామా చేశాడు. అంతేకాదు సిటీలోని డీసీపీ ఆఫీసు వద్ద గట్టిగా హారన్లు కూడా మోగించాడు. గ్యాంగ్‌స్టర్ అజయ్ థాకూర్‌పై 30 క్రిమినల్ కేసులు ఉన్నాయి. నల్లరంగు కార్ల వీడియో వైరల్ కావడంతో అతన్ని అరెస్టు చేశారు. ఆదివారం రోజు తన గర్ల్‌ఫ్రెండ్‌ను కారులో ఎక్కించుకుని.. కాన్వాయ్‌ను తీసుకెళ్లాడు. ఆ కాన్వాయ్ కార్లను నిర్లక్ష్యంగా నడిపించారు. వాటితో స్టంట్స్ కూడా చేశారు. ఆ కార్లలో అక్రమ ఆయుధాలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. కాన్వాయ్‌లో ఏ ఒక్క కారుకు కూడా నెంబర్ ప్లేట్ లేదు. రెండింటికి మాత్రం సైరన్లు ఉన్నాయి. ఓ కారుకు ఉన్న జెండా స్పష్టంగా లేదు. పాదాచారులకు ఇబ్బంది కలిగే రీతిలో కాన్వాయ్‌లోని వాహనాలు దూసుకెళ్లినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. అయితే అజయ్ థాకూరే కార్ల స్టంట్‌కు చెందిన వీడియోను ఆన్‌లైన్‌లో పోస్టు చేశాడు. దీంతో సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలు వచ్చాయి. మంగళవారం ఆ గ్యాంగ్‌స్టర్‌ను అరెస్టు చేశారు. అతనిపై రెండు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. రిజిస్టర్ కాని వాహనాలతో స్టంట్ చేసినట్లు గుర్తించామని డీసీపీ ఆశిష్ శ్రీవాత్సవ తెలిపారు. ఆ కార్ల ఓనర్లను గుర్తించే పనిలో ఉన్నామన్నారు. వాహనాల చట్టం ఆధారంగా చర్యలు

# అరచేతిలో 'ఉపాధి' సమాచారం...!

**ఉపాధిహామీ పనుల్లో పారదర్శకతపై కేంద్ర ప్రభుత్వం దృష్టి...!**

**అందుబాటులోకి జన్‌మన్‌రేగా యాప్...!**

**కూలీలు సైతం వేగంగా వివరాలు తెలుసుకునే అవకాశం...!**

**వికారాబాద్ జిల్లాలో 1,23,010 జాబ్‌కార్డులు..!**



**క్రైమ్ మిర్రర్ వికారాబాద్ జిల్లా ప్రతినిధి:** వలసలు అరికట్టేందుకు ప్రా రంభించిన ఉపాధిహామీ పథకం ఏటా లక్షలాది మంది కడుపు నింపుతోంది. మరోవైపు అక్రమాలు ప్రభుత్వానికి తలనొప్పిగా మారాయి. ఈ నేపథ్యంలో కేంద్రం ప్రభుత్వం ఉపాధిహామీ పథకంలో పారదర్శకత కోసం సరికొత్త నిబంధనలు అమలు చేస్తూ నూతన టెక్నాలజీని అందిపుచ్చుకుంటోంది. కూలీలు సైతం అరచేతిలో వేగంగా వివరాలు తెలుసుకునే విధంగా జన్‌మన్‌రేగా యాప్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. స్మార్ట్‌ఫోన్ వినియోగదారులందూ ప్లేస్టోర్ నుంచి ఈ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకునే సౌలభ్యం ఉంది.

**జిల్లాలో 1,86,040 జాబ్‌కార్డులు...!**

జిల్లాలో 18 మండలాల పరిధిలోని 566 గ్రామ పంచాయతీల పరిధిలో మొత్తం 1,86,040 జాబ్ కార్డులున్నాయి. 3,78,520 మంది కూలీలు నమోదు చేసుకున్నారు. జాబ్ కార్డుల్లో 1,31,475 మందిలో 2,45,283 మంది కూలీలు మాత్రమే ఉపాధి పనుల్లో చురుకుగా పాలుపంచుకుంటున్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 59,85,161 పని రోజులు కూలీలకు కల్పించాల్సి ఉండగా, ఇప్పటి వరకు 58,563,245 పని రోజులు కల్పించారు. ఒక్కో కుటుంబానికి వంద రోజుల పని కల్పించాల్సి ఉండగా,ఇప్పటి వరకు 3,253 కుటుంబాలకు వంద రోజుల చొప్పున పని కల్పించామని ఈజీఎస్ అధికారులు తెలిపారు. జిల్లాలో యాసంగిలో పంటల సాగు అంతంతే ఉంటుంది. దీంతో వర్షాకాలం పంటల సీజన్ ముగిసిన తర్వాత ఎక్కువ మంది ఉపాధి పనులకు వెళ్తుంటారు. కూలీల ఖాతాలు సక్రమంగా లేకపోవడం, కూలి నగదు ఖాతాల్లో జమ కాకపోవడం, ఇతర సమస్యలతో కూలీలు ఇబ్బంది పడుతున్నారు. కూలీలు జన్‌మన్‌రేగా యాప్ ద్వారా నగదు చెల్లింపులకు కారణాలను కూడా తెలుసుకోవచ్చు. కుటుంబానికి సంబంధించిన వివరాలనూ సరిచూసుకోవచ్చు.

**మరింత పకడ్బందీగా...!**

ఉపాధిహామీ పనుల్లో ఏటా అక్రమాలు చోటుచేసుకుంటున్నాయి. అధికారులు సామాజిక తనిఖీలు చేపట్టి గ్రామసభల్లో పనుల వివరాలు వెల్లడిస్తూ అక్రమాలను వెలుగులోకి తీసుకువస్తున్నారు. అయితే నిధుల రికవరీ మాత్రం పూర్తిస్థాయిలో సాధ్యం కావడం లేదు. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం పథకం అమలులో అక్రమాలకు చెక్ పెట్టేందుకు చర్యలు ప్రారంభించింది. ఇప్పటికే కూలీల లైవ్ లొకేషన్‌తో ఫొటో అప్‌లోడ్ చేయాలనే నిబంధనను తీసుకువచ్చింది. ఆన్‌లైన్ హాజరుతో చాలా వరకు అవకతవకలకు అడ్డుకట్ట పడింది. ఇప్పుడు ఉపాధిహామీ పథకానికి సంబంధించిన సమాచారాన్ని పూర్తిగా తెలుసుకునేందుకు జన్‌మన్‌రేగా యాప్‌ను అభివృద్ధి చేసింది. రాష్ట్రం, జిల్లా, మండలం, పంచాయతీ, కుటుంబం గుర్తింపు నంబర్ వివరాలు ముందుగా నమోదు చేయాలి. పేమెంట్ ఆప్షన్‌లో వ్యక్తి పేరు మీద క్లిక్ చేస్తే ఎక్కడ పని చేశారు.. పని దినాల సంఖ్య.. వేతనం ఎంత.. ఎప్పుడు జమైంది.. ఏ బ్యాంకు ఖాతా ఉంది.. అనే వివరాలు క్షణాల్లో తెలుసుకోవచ్చు. అలాగే ఆధార్ నంబర్ లింకు అయిందా లేదా.. ఆధార్ బ్రిడ్జ్ పేమెంట్ సిస్టం లింకు అయిందో కూడా సరి చూసుకోవచ్చు. అన్ని వివరాలు సక్రమంగా ఉంటే పచ్చరంగు కనిపిస్తుంది. సమస్య ఉన్నచోట ఎరుపు రంగు చూపుతుంది. అలాగే జాబ్‌కార్డులోని కుటుంబ సభ్యుల పని వివరాలు కూడా ఎప్పటికప్పుడు చూసుకోవచ్చు. ఏ ఆర్థిక సంవత్సరంలో ఎన్ని రోజులు పనిచేశారు..కుటుంబంలో ఎవరు ఎన్ని రోజులు పనికి వచ్చారు అనే వివరాలు స్పష్టంగా చూపిస్తుంది. కూలీలకు పూర్తి వివరాలు తెలిస్తే అక్రమాలు జరిగిన సమయంలో సిబ్బంది,అధికారులను నిలదీసే అవకాశం ఉంటుందని ప్రభుత్వం భావిస్తోంది.

**అవగాహన కల్పిస్తున్నాం..!**

**డీఆర్‌డీవో శ్రీనివాస్ వికారాబాద్..!**



జనమన్‌రేగా యాప్ వినియోగంపై ఉపాధిహామీ కూలీలకు అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. ఈ యాప్ ద్వారా కూలీలు పనులకు సంబంధించిన పూర్తి వివరాలు తెలుసుకోవచ్చు. స్మార్ట్‌ఫోన్ ఉన్నవారు యాప్ ఇన్‌స్టాల్ చేసుకునే విధంగా గ్రామాల్లో ఎఫ్‌ఏలు, టీఏల ద్వారా ప్రచారం చేస్తున్నారని తెలిపారు.



## ఆశావర్కర్లంతా ఐక్యమత్యంతో ఉద్యమించాలి

**గండిపేట మండల కన్వీనర్ దప్పు ప్రవీణ్‌కుమార్**

**నేడు ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ఇల్లు, క్యాంప్ కార్యాలయం ముందు ధర్నా.**

**గండిపేట్(క్రైం మిర్రర్):** తమ సమస్యలను పరిష్కరించుకునేందుకు ఆశావర్కర్లంతా ఐక్యమత్యంతో ఉద్యమించాలని సీఐటీయూ గండిపేట మండల కన్వీనర్ దప్పు ప్రవీణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ఇల్లు, ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నామన్నారు. గురువారం నార్సింగి పిహెచ్‌ఎస్‌లో ఆశవర్కర్స్ సమస్యలపైన వినతిపత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ ఆశావర్కర్ల సమస్యలపైన అనేక ధర్నాలు, కమీషనర్ల ఆఫీసర్ల ముందు ధర్నాలు, బస్సు యాత్రలు ఎన్ని జరిపిన కాంగ్రెస్ ప్రభుత్వానికి చలనం రావడం లేదన్నారు. ఇందులో భాగంగా శుక్రవారం ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ ఇండ్లు, క్యాంపు కార్యాలయం వద్ద ఆశావర్కర్లతో కలిసి పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. కనీస వేతనం 18 వేలు ఫిక్స్‌డ్ వేతనం ఇవ్వాలని, ఆశాలను పర్మినెంట్ చేయాలని, పిఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యాలు, ఇన్సూరెన్స్ సౌకర్యాలు కల్పించాలని అనేక సమస్యల మీద శుక్రవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం ఎదుట ధర్నా ఉంటుందన్నారు. పెద్ద ఎత్తున ఆశాలు కదిలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆశావర్కర్లు పాల్గొన్నారు.

## సంక్రాంతి ఉత్సవాల ఆవశ్యకతను విద్యార్థి దశలోనే తెలుసుకోవాలి

**నవయువ యూత్ క్లబ్ అధ్యక్షుడు ఏరువా కుమారస్వామి**





**గండిపేట్, (క్రైమ్ మిర్రర్) :** సంక్రాంతి ఉత్సవాల ఆవశ్యకతను విద్యార్థులు తెలుసుకోవాల్సిన అవసరం ఉందని రాజేంద్రనగర్ సర్కిల్ నవ యువ యూత్ క్లబ్ అధ్యక్షులు కుమారస్వామి అన్నారు. గురువారం సంక్రాంతి ఉత్సవాలను పురస్కరించుకొని నవయువ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో మైలార్ దేవ్‌పల్లి డివిజన్ బుద్వేల్ నేతాజీ నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విద్యార్థులు ఉత్తమమైన ముగ్గులను వేసి వారి సృజనాత్మకతను ప్రదర్శించారు. కాగా ఐదవ తరగతి చెందిన మనీషా ప్రథమ బహుమతి, నాలుగవ తరగతికి చెందిన హర్షిత ద్వితీయ బహుమతి, మూడవ తరగతికి చెందిన శ్రీ జ్యోతి మూడవ బహుమతిని గెలుచుకున్నారు. ప్రోత్సాహక బహుమతులు
అనుకుమారి,భారతి,కుమారి,వరలక్ష్మి,తానియాలు గెలుపొందారు. ఈ మేరకు వారికి శుక్రవారం బహుమతులను ఇవ్వనున్నట్లు తెలిపారు ఈ కార్యక్రమంలో కిషోర్ రెడ్డి, శ్రీనివాస్, నవీన్ రెడ్డి, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు ఎస్.బాలకృష్ణ, జి.మమత, ఏ.మహేశ్వర్, ఎస్.లక్ష్మి, పి.యాదమ్మ పాల్గొన్నారు.

## ఆశా వర్కర్ కుటుంబ సభ్యులను పరామర్శించి, అండగా ఆర్థిక సహాయం

**టి ఎస్ ఆశా వర్కర్స్ యూనియన్ సి ఐ టి యు నాంపల్లి మండల కమిటీ**



**క్రైమ్ మిర్రర్, నాంపల్లి:** నాంపల్లి మండలం చిట్టెంపాడు గ్రామానికి చెందిన ఆశా వర్కర్ బుషి పాక సరిత ఈ మధ్యకాలంలో అనారోగ్యంతో మరణించడం జరిగింది. ఆమె దశదిన కర్మ సందర్భంగా తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ సి ఐ టి యు నాంపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఆమె చిత్రపటానికి పూలు వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అదేవిదంగా వారి కుటుంబానికి ఎల్లవేళలా తోడ్పాటునందిస్తామని, వారి కుటుంబంలో ఒకరికి ఆశ వర్కర్ ఉద్యోగం కల్పించాలని ప్రభుత్వాన్ని కోరుతామని, వారి కుటుంబానికి అండగా ఉంటామని 20వేల రూపాయల ఆర్థిక సాయం అంద చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు నాంపల్లి చంద్రమౌళి, ఆశ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) మండల అధ్యక్షురాలు రామవత్ కవిత, సెకండ్ ఏ ఎన్ ఎం ల మండల నాయకురాలు గాదెపాక పుష్ప, ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ సభ్యురాలు కోరే లలిత, సునీత, భాగ్యమ్మ, సైదమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ పోలీస్ అకాడామీలో చిన్నారి చైల్డ్ కేర్ సెంటర్‌ను ప్రారంభించిన అకాడామీ డైరెక్టర్ అభిలాష బిష్త్

**గండిపేట్(క్రైం మిర్రర్):** తెలంగాణ పోలీస్ అకాడామీలో చిన్నారి చైల్డ్ కేర్ సెంటర్‌ను గురువారం అకాడామీ డైరెక్టర్ అభిలాష బిష్త్ ప్రారంభించారు. అకాడామీలో పని చేస్తున్న మహిళలు, అకాడామీ సిబ్బంది పిల్లలకు ఉపయోగపడే విధంగా, అమెనిటీస్ బ్లాక్‌లో ఈ సదుపాయాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. రెండు నుంచి ఐదు సంవత్సరాలు వయస్సు గల పిల్లలు ఆడుకునేందుకు అనుగుణంగా, అన్ని సదుపాయాలను సమకూర్చడం జరిగిందన్నారు. అలాగే అడ్మినిస్ట్రేటివ్ కేబిన్స్, ఏఎస్‌ఐ ప్రీ ప్రమోషనల్ ట్రై నీస్‌లకు ఐ చెకప్ క్యాంప్‌లను ప్రారంభించారు. ఈ సందర్భంగా అకాడామీ డైరెక్టర్ అభిలాష బిష్త్ మాట్లాడుతూ అకాడామీ సిబ్బంది పని భారాన్ని, కుటుంబ బాధ్యతలను ఒత్తిడి లేని వాతావరణంలో నిర్వహించే విధంగా ఈ సదుపాయాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అదే విధంగా మినీస్టీరియల్ సిబ్బంది పని చేయడానికి అనుకూలంగా ఉండేందుకు నూతన క్యాబిన్లు ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జీ జె.డి.మురళీధర్, డిడిలు ఎన్.వెంకటేశ్వర్లు, పి.శ్రీరామమూర్తి, సునీతమోహన్, సి.నర్మద, అడిషనల్ డైరెక్టర్స్, డిఎస్‌పిలు, ఆర్‌ఐలు, అకాడామీ సిబ్బంది పాల్గొన్నారు.






## ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా పరిషత్ అధికారి

**- రికార్డుల పరిశీలన.. - పారిశుద్ధ్యంపై ప్రత్యేక శ్రద్ధ**

**- విద్యార్థులకు సలహాలు, సూచనలు**

**క్రైమ్ మిర్రర్, మహాదేవ్ పూర్:** మహాదేవపూర్ మండలం సూరారం గ్రామపంచాయతీ కార్యాలయంను గురువారం ఉదయం జిల్లా పంచాయతీ అధికారి నారాయణ రావు ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా గ్రామంలో పారిశుద్ధ కార్యక్రమాలపై వివరాల అడిగి తెలుసుకున్నారు. పారిశుద్ధ్య విషయంలో గ్రామపంచాయతీ కార్యదర్శి మరియు గ్రామపంచాయతీ సిబ్బందికి తగు సలహాలు సూచనలు ఇచ్చారు. అనంతరం జిల్లా పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి పదవ తరగతి విద్యార్థులతో కాసేపు మాట్లాడి విద్యా వ్యవస్థ గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పదవ తరగతిలో ఇంగ్లీష్ మీడియం చదువుతున్న విద్యార్థులకు రాబోయే వార్షిక పరీక్షల గురించి తగు సలహాలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సూరారం గ్రామపంచాయతీ కార్యదర్శి అంజలి, కారోబార్ రాజమౌళి, మండల పంచాయతీ అధికారి ప్రసాద్, జడ్.పి.హెచ్.ఎస్ ప్రధానోపాధ్యాయులు పురుషోత్తం మరియు గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.